ప్రతిపక్షం

www.prathipaksham.in



ఆదివారం 29.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 9 పేజీలు: 10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



‘అక్రమ మైనింగ్ విచారణకు ఈ ప్రభుత్వం సిద్ధం. గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్ర మైనింగ్‌పై విచారణ జరిపించేందుకు సిద్ధం. నేరెళ్లలో ఇసుక అక్రమాలు, ఎస్సీలపై చేసిన దాడులపై విచారణ జరిపిస్తాం. గతంలో మైనింగ్‌శాఖను పదేళ్లపాటు కేటీఆర్ తను గుప్పిట్లోనే పెట్టుకున్నారు. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆర్ఎస్ నేతలు, వారి బంధువులే. దాడులు చేయించి వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. హరీశ్‌రావు సోదరుడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారు. సోదరుల వ్యాపారాలతో మంత్రి పొంగులేటికి ఎలాంటి సంబంధం లేదు

- రేవంత్ రెడ్డి, సీఎం

అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

అక్రమార్కులు ఎంతటి వారైనా శిక్ష తప్పదు

- సీఐడీ నివేదిక ఆధారంగా కఠిన నిర్ణయాలు తీసుకుంటాం
- అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అక్రమ మైనింగ్ చేస్తున్నారు
- బీఆర్ఎస్ నాయకుడు హరీష్ రావు ఆరోపణ
- ఆ కంపెనీతో మంత్రికి సంబంధం లేదు
- కేవలం బ్లాక్‌మెయిల్ రాజకీయాల కోసమే ఈ ఆరోపణలు: సీఎం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: మైనింగ్ అంశంపై దద్దరిల్లిన శాసన సభ మైనింగ్ అంశంపై శాసనసభ దద్దరిల్లింది. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ ఇసుక, ఖనిజ తవ్వకాలపై సీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జూన్ 2, 2014 నుండి ఇప్పటి వరకు జరిగిన అన్ని మైనింగ్ లీజులు, అనుమతులు, అక్రమాలపై ఈ దర్యాప్తు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి పూర్తి స్థాయి నివేదికను సభ ముందు ఉంచుతామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు రాజేంద్రనగర్ మండలం మానస హిల్స్ ప్రాంతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ మైనింగ్ చేస్తోందని

...:: మిగతా 2లో

...:: 2లో

మెట్రో స్వాధీన తీర్మానానికి

అసెంబ్లీ ఆమోదం

- విస్తరణ కోసమే నిర్ణయం
- విస్తరణకు కేంద్రం సహకరించాలి
- తీర్మాణం ప్రవేశపెట్టిన సీఎం రేవంత్

ఈశ్వరుడి ఆశీర్వాదంతోనే

మూసీ ప్రక్షాళన

ఓట్లు, నోట్ల కోసం మూసీ అభివృద్ధి చేయడం లేదు

- బాధ్యతగా, పవిత్రంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది
- మూసీ ప్రక్షాళనకు అడ్డుపడితే శివతాండవమే
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి
- మంచిరేవుల వద్ద రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయం
- నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: ఓట్లు, నోట్ల కోసం మూసీ నదిని అభివృద్ధి చేయడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాధ్యతగా పవిత్రంగా మూసీ నది అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, ఈశ్వరుడి ఆశీర్వాదంతోనే

...:: మిగతా 2లో

అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

- అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తాం
- అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు
- సొంత భవనాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశం
- 'తొలి ముద్ద'ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

...:: 2లో

విద్యార్థులు ఆటల్లో కూడా ఆసక్తి పెంచుకోవాలి

- యువత మత్తు వదలి మైదానం బాట పట్టాలి
- క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తాం
- మెస్సీని రాష్ట్రానికి పిలిస్తే ప్రతిపక్షాలు విమర్శించాయి
- లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ -2026 ప్రారంభించిన సీఎం రేవంత్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. సాకర్ సూపర్ స్టార్ మెస్సీని రాష్ట్రానికి పిలిస్తే ప్రతిపక్షాలు విమర్శించాయని పేర్కొన్నారు. యువతను

...:: మిగతా 2లో

పెట్రోలియం, గ్యాస్ సరఫరాపై ఒత్తిడిని నియంత్రించాం

- పీఎన్జీ నెట్ విస్తరణలో కేంద్రంతో సమన్వయం చేసుకుంటాం
- ప్రభుత్వం సకాలంలో చర్యలతో సులభతర గ్యాస్ సరఫరా
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: పెట్రోలియం ఉత్పత్తులతో పాటు ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో పెరిగిన ఒత్తిడిని ప్రభుత్వం సమర్థవంతంగా నియంత్రించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వినియోగదారులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తేల్చిచెప్పారు. శనివారం దేశవ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తులతో పాటు వంటగ్యాస్ సరఫరాపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు,గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖా మంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్,హర్దీప్ సింగ్ పూరి,ప్రహ్లాద్ జోషీలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో తెలంగాణ రాష్ట్రం నుండి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే వీడియో కాన్ఫరెన్స్ లో దేశవ్యాప్తంగా 14 మున్సిపల్ కార్పోరేషన్ లకు చెందిన ప్రతినిధులతో పాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర,జీ. హెచ్ యం సి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇరాన్ అమెరికా ల మధ్య కొనసాగుతున్న యుద్ధ వాతావరణ ప్రభావంతో పెట్రోలియం ఉత్పత్తులతో గృహ వినియోగదారులకు వంటగ్యాస్ సరఫరాపై ప్రజల్లో అపోహలు పెరిగి నందునే ప్రజల్లో అయోమయం నెలకొనిందని ఆయన చెప్పారు. ప్రజల్లో ఒక్కసారిగా భయాందోళనలు పెరగడంతో తాత్కాలికంగా కొంత మేర ఇబ్బంది ఏర్పడిందన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో సమర్థవంతంగా వత్తిడిని నియంత్రించ గలిగామన్నారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోకి వచ్చిందని, డిమాండ్ కు తగిన రీతిలో సరఫరా కొనసాగుతోందని పైగా తాను స్వయంగా రంగంలోకి దిగి క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడంతో పాటు పంపిణీ దారులతో సమీక్షలు నిర్వహిస్తున్నానని ఆయన తెలిపారు. అయితే అదే సమయంలో వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్. పి.జి కొరతను దృష్టిలో పెట్టుకొని

...:: మిగతా 2లో



వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ పునరుద్ధరించాలి

- సత్వరమే నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి
- వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర రద్దు చేసింది
- జర్నలిస్టులను దిగజార్చడానికే నేషనల్ మీడియా కౌన్సిల్ ఏర్పాటు
- ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్
- విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశం

...:: 3లో

కాంగ్రెస్ మంత్రుల అక్రమ మైనింగ్

- రూల్స్ లేవు, పర్మిషన్లు లేవు, దర్జాగా దందా
- పొంగులేటి రాజీనామా చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: రాష్ట్ర అసెంబ్లీలో మైనింగ్ శాఖ పద్దులపై జరిగిన చర్చలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి సంబంధించినదిగా ఆరోపిస్తున్న రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ అక్రమ మైనింగ్ దోపిడీకి పాల్పడుతోందని అన్నారు. మైనింగ్ శాఖ ప్రభుత్వానికి నాన్ టాక్స్ ఆదాయం తెచ్చే అత్యంత కీలక విభాగమని పేర్కొన్న హరీశ్ రావు, అధికారులు, ప్రభుత్వం జాగ్రత్తగా పనిచేస్తే ఖజానాకు భారీ ఆదాయం వస్తుందని, ఆ నిధులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చని తెలిపారు. అయితే ప్రస్తుతం ఈ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి, కుంభకోణాలు జరుగుతున్నాయని, రాష్ట్ర ఆదాయానికి భారీగా గండి పడుతోందని ఆరోపించారు. తాము చేస్తున్న ఆరోపణలు అన్నీ పక్కా ఆధారాలతోనే చేస్తున్నామని, రాష్ట్ర ఖజానాకు నష్టం కలగకూడదన్నదే తమ ఉద్దేశమని స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరాన్ని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లోనే పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరుగుతోందని, “కంచె చేను మేసినట్లు, రక్షకుడే భక్షకుడిగా మారిన పరిస్థితి రాష్ట్రంలో ఉంది” అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులందరికీ

...:: మిగతా 2లో

మూసీ పేరిట లక్షన్నర కోట్ల అవినీతి

- అవినీతి గురించి ప్రశ్నిస్తే సీఎం బెదిరింపులకు దిగుతున్నారు
- బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదు
- పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలి.
- శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్ఎస్ వ్యతిరేకం కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 28: తెలంగాణలో తన స్కాములు, అవినీతి గురించి ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెదిరింపులకు దిగుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నించిన సందర్భంలో కూడా ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణి ప్రదర్శించారని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డికి బెదిరింపులు అలవాటైపోయాయని, అలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ ఎప్పటికీ భయపడదని స్పష్టం చేశారు. మూసీ ప్రాజెక్ట్

...:: మిగతా 3లో

యుద్ధ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

పశ్చిమాసియాలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

9

అయోధ్య యజ్ఞశాలలో అగ్నిప్రమాదం

అయోధ్యలో భారీ అగ్నిప్రమాదం జరి గింది. శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదయింది.

9

164 స్థానాల్లో డీఎంకే పోటీ

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం అధికార డీఎంకే తొలి జాబితా విడుదల చేసింది. మొత్తం 234 స్థానాలకు గాను 164 స్థానాల్లో డీఎంకే పోటీ చేయనున్నది. మిగతా 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది.

9

ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

విశాఖపట్నం నుంచి వస్తున్న ఇండిగో విమానం(6ఈ579) ఇంజన్ విఫలమైనట్లు అనుమానం రావడంతో ఢిల్లీ విమానాశ్రయ రన్‌వేపై పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

9

రాజకీయం

మెట్రో స్వాధీన తీర్మానానికి అసెంబ్లీ ఆమోదం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 28: హైదరాబాద్ మెట్రోరైలును ప్రభుత్వం తీసుకునేందుకు ఉద్దేశించిన తీర్మానాన్ని శాసన సభ ఆమోదించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకే ప్రభుత్వం మెట్రోరైల్‌ను స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు తీర్మానం పెట్టిన తర్వాత వివరించారు. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

తీర్మానాలు ఏకపక్షంగా ఆమోదించడం సరికాదు: హరీష్‌రావు

అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. ఖనిజాలపై ఏటా ఆదాయం పెరుగుతోందని తెలిపారు. మైనింగ్ శాఖలో అనేక అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపించారు. తాను అన్ని ఆధారాలతోనే మాట్లాడుతున్నానన్నారు. తెలంగాణకు వచ్చే ప్రతి రూపాయిని కాపాడుకోవాలని కోరారు.

ప్రభుత్వానికి ఎల్‌అండ్‌టీ విజ్ఞప్తి..

నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎల్‌అండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎల్‌అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎల్‌అండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణ: సీఎం

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెట్రో విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులపై సమీక్షించామని అన్నారు. ప్రస్తుతం 69 కి.మీ. మెట్రో నిర్మాణం జరిగిందని చెప్పారు. మెట్రో ఫేజ్ 2ఏ కింద 76.4 కి.మీ, మెట్రో ఫేజ్ 2బీ కింద 86.1 కి.మీ మేర నిర్మాణం కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని వెల్లడించారు. మెట్రో విస్తరణపై సీఎం అసెంబ్లీలో ప్రసంగించారు. మెట్రో ఫేజ్ 1 నుంచి వైదొలిగేందుకు ఎల్ అండ్ టీ అంగీకరించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మెట్రో రెండో దశలో పాల్గొనాలని ప్రభుత్వం కోరిందని, మెట్రో ఫేజ్ 2ఏ, బీలో పాల్గొనేందుకు ఎల్‌అండ్‌టీ సుముఖంగా లేదని మంత్రి తెలిపారు.

విద్యార్థులు ఆటల్లో కూడా ఆసక్తి పెంచుకోవాలి

మొదటిపేజీ తరువాయి

మత్తు వదలి మైదానం బాట పట్టమని సీఎం విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తుందని, క్రీడల్లో రాణించిన వారిని ప్రభుత్వం గౌరవిస్తుందని వెల్లడించారు. బేగంపేట హాకీ స్టేడియాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభ్యులు, శాసనపరిషత్ సభ్యుల క్రీడా పోటీలకు సంబంధించిన మొదటి ఎడిషన్ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ 2026ను ఎల్బీ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమాన్ని శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత మొదటి సారిగా శాసనమండలి సభ్యులకు, శాసనసభ్యులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరగడం సంతోషకరమని పేర్కొన్నారు. ఎప్పుడు ప్రజా సమస్యలు, రాజకీయాలతో బిజీగా, ఉండే నాయకులు క్రీడలలో, కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొనడం ద్వారా ఒత్తిడి తగ్గి రిలాక్స్ అవుతారని అన్నారు. అన్ని పక్షాల సభ్యులు కలిసి ఆడి, పాడడం ద్వారా పండుగ వాతావరణం ఏర్పడుతుందన్నారు. తద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చిన వాళ్లం అవుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అనేక క్రీడా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఫుట్‌బాల్ ఆటలో సీఎం టీమ్ నుంచి నాగార్జునసాగర్ ఎంఎల్ఏ జైవీర్ గోల్ కొట్టారు. స్పీకర్ టీమ్‌ను గెలిపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి జట్టు మారారు. ఎంఎల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు క్రీడా స్ఫూర్తిని చాటుకున్నారు. స్పీకర్ టీమ్ కోసం సీఎం గోల్ కొట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్ బాల్‌లో 4 గోల్స్ సాధించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచినారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. కబడ్డీలో టీమ్ బీపై టీమ్ ఏ విజయం సాధించింది. స్పోర్ట్స్ మినిస్టర్ శ్రీహరి టీమ్‌కు విజయం వరించింది.

పెట్రోలియం, గ్యాస్ సరఫరాపై ఒత్తిడిని నియంత్రించాం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణాకు వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే కేటాయింపులను పెంచాలని ఆయన కేంద్ర మంత్రులను కోరారు కేంద్రం వాణిజ్య అవసరాలకు పంపిణీ చేసే గ్యాస్ కోటా కేటాయింపులను పెంచగలిగితే వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ సరఫరా చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో కృత్రిమ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్న అంశంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందన్నారు. బ్లాక్ మార్కెట్ కు తరలించడంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెంచి కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో పైపుల ద్వారా వంటగ్యాస్ సరఫరా నెట్ వర్క్ విస్తరణలో కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని ముందుకు పోతామన్నారు. హైదరాబాద్ లో భాగ్యనగర్ గ్యాస్ సంస్థ ద్వారా సి.ఎన్.జి సరఫరాను విస్తరిస్తున్నామని, జంట నగరాలలో ఆటోలు, ట్యాక్సీ లతో పాటు ప్రయివేటు వాహనాలకు సి.ఎన్.జీ సరఫరాకై ఫిల్లింగ్ కేంద్రాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

పేదల రక్తం తాగుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు

- వేధింపులు ఆపకపోతే ఊరుకోం
- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్

ప్రతిపక్షం,హుస్నాబాద్, మార్చి 28: ఆకర్షణీయమైన ప్రకటనలతో ప్రలోభపెట్టి పేద ప్రజల రక్తాన్ని తాగుతున్న ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలపై ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అరచేతిలో స్వర్గం చూపిస్తూ లోన్ల పేరుతో ఈ సంస్థలు పేదల కుటుంబాలను బజారున పడేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదల అవసరాలను ఆసరాగా చేసుకొని పలు ప్రైవేటు కంపెనీలు యమపాశం కంటే ఘోరంగా ప్రాణాలు తీస్తున్నాయని మండిపడ్డారు.బ్యాంకులతో ఒప్పందాల పేరుతో క్రిమినల్ నోటీసులు పంపిస్తూ, సామాన్య ప్రజలను మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని ఆయన విమర్శించారు. అధిక వడ్డీలు వసూలు చేయడమే కాకుండా, నెలవారీ వాయిదాల చెల్లింపుల్లో స్వల్ప ఆలస్యమైనా ఏజెంట్ల ద్వారా చిత్రహింసలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇంట్లో భార్యాపిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టలేకపోయినా సరే, ఫైనాన్స్ చిట్టీ కట్టి తీరాలని ఒత్తిడి చేస్తూ బాధితులను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెంట్ల వేధింపుల వల్ల సామాన్యుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని రాజ్ కుమార్ పేర్కొన్నారు. పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి మోసపూరిత ఫైనాన్స్ కంపెనీలపై పోలీసులు, ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణ

మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు. దీనిపై రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. ఆ కంపెనీతో మంత్రికి సంబంధం లేదని, కేవలం బ్లాక్‌మెయిల్ రాజకీయాల కోసమే బీఆర్ఎస్ ఈ ఆరోపణలు చేస్తోందని కొట్టిపారేశారు. అయితే, విచారణ మాత్రం నిష్పక్షపాతంగా జరుగుతుందని, అక్రమాలకు పాల్పడిన వారు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ వల్ల రాష్ట్ర ఖజానాకు భారీ గండి పడిందని రేవంత్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనింగ్ ద్వారా వచ్చే ఆదాయం 32 శాతం పెరిగిందని ఆయన గణాంకాలను వివరించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో నిజం లేదని, అదే నిజమైతే ఇసుక అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం ఎలా పెరుగుతుందని ఆయన ప్రశ్నించారు. ఇసుక రవాణాలో పారదర్శకత కోసం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, ఆన్‌లైన్ బుకింగ్ సమయాన్ని కూడా సవరించామని తెలిపారు. ప్రభుత్వ భూములు, ప్రకృతి సంపదను కొల్లగొట్టే వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని, సీఐడీ నివేదిక ఆధారంగా తదుపరి కఠిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన సభకు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రల పేర్లను ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో గ్రానైట్ మైనింగ్‌లో భారీ అక్రమాలు జరిగాయని, ఫెమా నిబంధనలను ఉల్లంఘించి విదేశాలకు గ్రానైట్ ఎగుమతి చేశారని ఆరోపించారు. గత పదేళ్లలో వీరు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలను ఎగ్గొట్టడమే కాకుండా, పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కారని రేవంత్ మండిపడ్డారు. గతంలోనే గంగుల కమలాకర్, వద్దిరాజు రవిచంద్రలకు చెందిన గ్రానైట్ కంపెనీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులు చేసి, సుమారు రూ. 750 కోట్ల వరకు జరిమానాలు విధించిన విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయితే, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ జరిమానాలను వసూలు చేయకుండా వారిని కాపాడిందని ఆయన ఆరోపించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం ఆ బకాయిలను వసూలు చేయడంతో పాటు, జరిగిన అక్రమ మైనింగ్‌పై సమగ్ర విచారణ జరిపి నివేదిక సిద్ధం చేస్తుందని ప్రకటించారు. ఈ విచారణ కేవలం రాజకీయ కక్ష సాధింపు కాదని, రాష్ట్ర సంపదను కాపాడటమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. గంగుల, వద్దిరాజుల కంపెనీలతో పాటు గత ప్రభుత్వంలో మైనింగ్ లీజులు పొందిన ఇతర నేతల వివరాలను కూడా సేకరించాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ దర్యాప్తులో ఈ నేతల పాత్ర రుజువైతే, మైనింగ్ లీజుల రద్దుతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది.

అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 28: తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద'ను ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్‌లో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు మొబైల్ ఫోన్‌లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అంగన్‌వాడీ కేంద్రాలలకు సొంత భవనాలు

ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.

కాంగ్రెస్ మంత్రుల అక్రమ మైనింగ్

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర వనరులను కాపాడే బాధ్యత ఉందని గుర్తుచేశారు. శంషాబాద్ మండలం కొత్వాల్ గూడ గ్రామంలోని సర్వే నంబర్లు 62, 63లో జీవో 111 పరిధిలో ఎలాంటి కాలుష్య పరిశ్రమలు ఏర్పాటు చేయరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ, రాఘవ కన్స్ట్రక్షన్స్ భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని తెలిపారు. జీవో 111ను బేఖాతరు చేస్తూ, రూల్స్ లేకుండా, పర్మిషన్లు లేకుండా దర్జాగా అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 26 (స్టోన్ క్రషర్ రూల్స్ 2026) ప్రకారం స్టోన్ క్రషర్ ఏర్పాటు చేయాలంటే మినరల్ డీలర్ లైసెన్స్ , ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ అనుమతి, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సీఎఫ్ఈ, సీఎఫ్ఓ సర్టిఫికెట్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. అయితే రాఘవ కన్స్ట్రక్షన్స్‌కు అవేవీ లేదని పేర్కొన్నారు. అనుమతులు లేకపోవడంతో విద్యుత్ కనెక్షన్ పొందలేక డీజిల్ జనరేటర్లపై స్టోన్ క్రషర్‌ను నడుపుతూ అక్రమంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ రెండుసార్లు పట్టుబడినా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎందుకని ప్రశ్నించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ఒక న్యాయం, అధికార పార్టీ మంత్రులకు మరో న్యాయం అమలు చేస్తున్నారని ఆరోపించారు. పటాన్ చెరువు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమ్ముడి స్టోన్ క్రషర్‌లో చిన్న తప్పు జరిగినా రాత్రికి రాత్రే అరెస్టు చేసి నెలరోజులు జైలులో పెట్టారని గుర్తు చేశారు. మూసీ నది, గండిపేట్, హిమాయత్ సాగర్ కాలుష్యానికి ఈ అక్రమ మైనింగ్ కారణమవుతుందని మైనింగ్ అధికారులు లిఖితపూర్వకంగా పేర్కొన్నారని తెలిపారు. ఒకవైపు ముఖ్యమంత్రి కాలుష్యం జరగవద్దని చెబుతుంటే, మరోవైపు ఈ ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి రాఘవ కన్స్ట్రక్షన్స్‌తో సంబంధం లేదని ప్రభుత్వం చెబుతోందని, అయితే గతంలో ఇదే అంశంపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినప్పుడు మంత్రి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి తీవ్రంగా స్పందించారని గుర్తుచేశారు. సంబంధం లేకపోతే ఎందుకు స్పందించారో చెప్పాలని ప్రశ్నించారు. మంత్రి సీతక్క వ్యాఖ్యలపై కూడా హరీశ్ రావు స్పందిస్తూ గత ప్రభుత్వంలో తప్పులు జరిగితే మేము చేస్తే తప్పేంటి అన్న భావన సరికాదన్నారు. ఏ ప్రభుత్వం అయినా తప్పులు చేయడానికి హక్కు లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా నిజాయితీగా ఉంటే ప్రతిపక్ష సభ్యులతో హౌస్ కమిటీ వేయాలని లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై తమకు వ్యక్తిగత ద్వేషం లేదని, కానీ జరిగిన తప్పులను ఆధారాలతో బయటపెట్టడం ప్రతిపక్ష బాధ్యత అని స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాను కాపాడటం తమ కర్తవ్యమని తెలిపారు. చివరగా మంత్రి పొంగులేటి తక్షణమే నైతిక బాధ్యతగా రాజీనామా చేసి విచారణను ఎదుర్కోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ఈశ్వరుడి ఆశీర్వాదంతోనే మూసీ ప్రక్షాళన

మొదటిపేజీ తరువాయి

మూసీనది ప్రక్షాళన చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు ఎవరైనా అడ్డుకుంటే శివతాండవం తప్పదని సీఎం హెచ్చరించారు. మూసీ నది అభివృద్ధిలో భాగంగా మంచిరేవుల వద్ద రూ.700 కోట్లతో ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మూసీ నది ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు తామంతా శివదీక్ష చేపట్టామని సీఎం పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తోంది. గండిపేట మండలం మంచిరేవుల వద్ద చారిత్రక వీరభద్ర మచిలేశ్వర ఆలయం వద్ద నూతనంగా నిర్మించనున్న ఓంకారేశ్వర ఆలయానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా వీరభద్ర మచిలేశ్వర ఆలయానికి చేరుకున్న రేవంత్ రెడ్డికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి గోశాలలో గోపూజ నిర్వహించి చేవెళ్ల మండలం ఎన్కేపల్లి వద్ద హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న అధునాతన గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మచిలేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో కలిసి వేదమంత్రోచ్చరణలు మారుమోగుతుండగా ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి భూమి పూజచేశారు. సుమారు రూ.700తో 8 ఎకరాల్లో రామప్ప ఆలయం తరహాలో నిర్మించనున్న ఓంకారేశ్వ ఆలయ నిర్మాణ శిలఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు.

ఈశ్వరుడి ఆశ్వీరాదంతో మూసీ అభివృద్ధి జరుగుతుంది

మూసీ అభివృద్ధి ఈశ్వరుడి ఆశ్వీరాదంతో జరుగుతుందని, పునరుద్ధరించే అవకాశం తమ ప్రభుత్వానికి దక్కడం దైవ నిర్ణయమని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల్లో ఎంతో మంది మూసీ నదిని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించినా సాకారం చేయలేకపోయారన్నారు. ఎన్ని విమర్శలు, ఆరోపణలు ఎదురైనా మూసీ నదిని అభివృద్ధి చేసితీరుతామని పునరుద్ఘాటించారు. నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రజాప్రతినిధులంతా అభివృద్ధి కోరుకుంటున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరైనా మూసీ నది ప్రాజెక్టు పనులను అడ్డుకుంటే శివతాండవం చేస్తామని హెచ్చరించారు. మూసీ నది పనులు చేపట్టడం నిత్యవసరాల కంటే అత్యవసరమని పేర్కొన్న రేవంత్ రెడ్డి ప్రకృతి తప్పిదాలతో దిల్లీ లాంటి నగరాలు కాలుష్యం భారినపడ్డాయని, మానవ తప్పిదాలతో మూసీనది వల్ల నల్గొండ జిల్లా ప్రజలు నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మత సామరస్యం ప్రతిబింబించేలా మూసీ పరివాహక ప్రాంతం

మూసీ నది అభివృద్ధి ఖర్చుతో కూడున్నపని అయినప్పటికీ మంత్రివర్గంలో నిర్ణయం తీసుకొని పనులు మొదలుపెట్టినట్లు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాన్ని మత సామరస్యం ప్రతిబింబించేలా మంచి రేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయం, పురానాపూల్ వద్ద మసీదు, గౌలిగూడ వద్ద గురుద్వార్, నాగోల్ వద్ద మెదక్ తరహాలో భారీ చర్చ్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే మూసీలో 365 రోజులు మంచినీటి ప్రవాహం ఉండేలా 20 టీఎంసీల గోదావరి జలాలను గండిపేట, హిమాయత్ సాగర్‌లకు తరలించి 5 టీఎంసీలో మూసీలోకి విడుదల చేస్తామని తెలిపారు. ఆ పనులు ముమ్మరంగా సాగుతున్నట్లు రేవంత రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై సీఎం మండిపడ్డారు. ఈ ప్రాంతంలో రాజకీయ లబ్ది పొంది అన్ని పదవులు అనుభవించిన ఆమె తన కుమారుడితో మూసీ ప్రాజెక్టు పనులు ఆపాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో కేసు వేయించారని విమర్శించారు. మీకు ప్రజాప్రతినిధిగా కొనసాగే అర్హతా ఉందా? అని సబితా ఇంద్రారెడ్డిని ప్రశ్నించారు. రామప్ప ఆలయ నమూనాలో మంచిరేవుల ఓంకారేశ్వర ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్న రేవంత్ రెడ్డి దక్షిణ కాశిగా భావించేలా ఈ పుణ్యక్షేత్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. ఈ అభివృద్ధి చూపించి ఓట్లు అడుగమని, ఎవరు అడ్డుకున్నా మూసీ నది ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని తేల్చి చెప్పారు.



గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు మాట్లాడే స్వేచ్ఛ లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రశ్నించే, మాట్లాడే స్వేచ్ఛను కల్పించాం. రాజకీయ పార్టీలకు సొంత మీడియా ఉండటం ప్రమాదానికి దారితీస్తోంది. మీడియాలో విలువలు పడిపోతున్నాయి. పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉంది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరగకుండా నియంత్రణకు జర్నలిస్టులు కృషి చేయాలి.
- ఐజేయూ ప్లీనరీలో ఏపీ సీఎం చంద్రబాబు

భద్రాచలంలో వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం

- తిలకించిన రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దంపతులు

ప్రతిపక్షం ప్రతినిధి, భద్రాచలం, మార్చి 28: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లా లకు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు.

భద్రగిరి మార్ట్ ప్రారంభించిన గవర్నర్

ఈ సందర్భంగా గవర్నర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో భద్రాచలంలో భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి (జనరల్) డేవిడ్ గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు. మార్ట్‌లో ప్రదర్శనకు ఉంచిన వివిధ అటవీ ఉత్పత్తులను పరిశీలించి, వాటి నాణ్యతను అభినందించారు. ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ ఉత్పత్తులను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడం శ్లాఘనీయమని పేర్కొన్నారు.

మూసీ పేరిట లక్షన్నర కోట్ల అవినీతి

మొదటిపేజీ తరువాయి

పేరుతో జరుగుతున్న అవినీతి పై కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఒక్క రూపాయి లేదని చెప్పే సీఎం, తన అవినీతి సొమ్ముల కోసం మూసీ పేరిట లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తానని ప్రకటించడం దారుణమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 16 వేల కోట్లతో రూపొందించిన సమగ్ర ప్రణాళికను పక్కన పెట్టి, భారీ అంచనాలతో అవినీతి కార్యక్రమాన్ని చేపట్టడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం మూసీ నదిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటిని మూసీలోకి పంపించే ప్రణాళిక కూడా సిద్ధంగా ఉందని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను అనవసరంగా పెంచి అవినీతికి మార్గం సుగమం చేస్తోందని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షలాది ఇళ్లను కూల్చివేయడానికి, దాదాపు 3000 ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్ట విరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళ్లు, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరి అని అన్నారు. మూసీ పేరిట జరుగుతున్న అవినీతి చర్యలను జాతీయ స్థాయి ప్రముఖులు కూడా వ్యతిరేకిస్తున్నారని, గాంధీ కుటుంబ సభ్యులు సైతం దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. అయినప్పటికీ ఇప్పుడు దేవుడి పేరును ఉపయోగించి ప్రజలను మోసం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. తాను చేస్తున్న అవినీతి ప్రశ్నిస్తే "శివతాండవం చేస్తాను" అంటూ సీఎం మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. రేవంత్ రెడ్డి తన అధికార అహంకారాన్ని తగ్గించుకొని, మూసీ ప్రాజెక్ట్‌ను ప్రజలకు ఇబ్బంది కలగకుండా అమలు చేయాలని, లేదంటే లక్షలాది ఇళ్లను కూల్చిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో అభయహస్తం పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని విమర్శించారు. మూసీ ప్రాజెక్ట్ పై అసలు ప్రణాళికలు లేకుండా, డీపీఆర్ కూడా సిద్ధం చేయకుండా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకుంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని, మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల జీవితాలను నాశనం చేయడాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఇళ్లు కూల్చకుండా, భూములు స్వాధీనం చేసుకోకుండా శాస్త్రీయ పద్ధతిలో మూసీ శుద్ధి చేస్తే బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం వేలాది కుటుంబాలు భయాందోళనలో ఉన్నాయని, ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి భావోద్వేగ అంశమని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క కార్యక్రమం కూడా చేయలేదని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం దుర్మార్గమని కేటీఆర్ మండిపడ్డారు. రాబోయే కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ మెదటివారంలో మేధావులు, పర్యావరణ నిపుణులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఏప్రిల్ 14 వరకు ప్రతి కాలేజీ, ప్రతి బస్తీలో ప్రచారం చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. వెంటనే తాళాలు తీసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, లేకపోతే ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి సందర్భంగా వేలాది మందితో వెళ్లి తాళాలు బద్దలుకొట్టి ఘనంగా వేడుకలు నిర్వహిస్తామని హెచ్చరించారు. చివరగా, పేదల పక్షాన, అణగారిన వర్గాల పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తామని, కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం చేపట్టే పోరాటానికి పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె, ఎమ్మెల్యే సుమన్, రాష్ట్ర నాయకులు పటోళ్ల కార్తీక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్కింగ్ జర్నలిస్ట్ యాక్ట్ పునరుద్ధరించాలి

- సత్వరమే నూతన వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి
- వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర రద్దు చేసింది
- జర్నలిస్టులను దిగజార్చడానికే నేషనల్ మీడియా కౌన్సిల్ ఏర్పాటు
- ఐజేయూ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి డిమాండ్
- విజయవాడలో ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశం

ప్రతిపక్షం, విజయవాడ, మార్చి 28: వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని పునరుద్ధరించాలని, సత్వరమే కొత్త వేజ్ బోర్డు ఏర్పాటుతో పాటు, మీడియా స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు కొత్త చట్టాలు తీసుకురావాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐ జేయూ) అధ్యక్షులు కె శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంలో జరిగిన ఐజేయూ 11వ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దాదాపు రెండు దశాబ్దాలుగా జర్నలిస్టులకు వేతన సవరణలు జరగలేదని, దీంతో వారి పరిస్థితి అసంఘటిత రంగం కార్మికుల కంటే దారుణంగా మారిందని తెలిపారు. రాజ్యాంగంలో 4 వ స్థంభంగా పిలిచే మీడియా నేడు ముక్కలు అయిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని కేంద్ర రద్దు చేసిందన్నారు. జర్నలిస్టులను దిగజార్చడానికే నేషనల్ మీడియా కౌన్సిల్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఇందులో వర్కింగ్ జర్నలిస్టులకు ఎటువంటి ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. ఆర్ఎన్ఐ ను మార్చివేసి పీఆర్జీఐ ను ఏర్పాటు చేసిందని అన్నారు. "బలమైన, స్వతంత్ర విధానం లేకుండా ప్రజాస్వామ్యం సజావుగా నడవదు. దురదృష్టవశాత్తు, మీడియాను కేవలం నిర్లక్ష్యం చేయడమే కాకుండా, వ్యవస్థపూర్వకంగా నియంత్రిస్తున్నారు," అని ఆయన వ్యాఖ్యానించారు. పని గంటలు, నైట్ డ్యూటీ నియమాలు వంటి ప్రాథమిక అంశాలను యాజమాన్యాలు తరచుగా పట్టించుకోవడం లేదని శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డిజిటల్ (సోషల్) మీడియా ఒత్తిడితో సాంప్రదాయ మీడియా క్షీణిస్తోందని, పత్రికలు, టీవీ ఛానళ్లు ప్రేక్షకాదరణ కోసం తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని యూఎన్ఐ కార్యాలయాన్ని ఇటీవల అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటనను ఆయన పెరుగుతున్న అసహనానికి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను మరింత అధికారాలతో మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియాగా పునర్వ్యవస్థీకరించాలనే తీర్మానాన్ని ప్లీనరీ ఆమోదించింది అని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఐజేయూ ప్రధాన కార్యదర్శి బల్విందర్ సింగ్ జమ్ము మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టుల పరిస్థితి దిగజారుతోందని, దాడులు, హత్యల వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. "దేశంలోనే కాకుండా విదేశాల్లో కూడా విధులు నిర్వహించే సమయంలో జర్నలిస్టులు తీవ్రమైన ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. స్వేచ్ఛా భావ వ్యక్తీకరణపై అధికారుల అసహనం పెరుగుతోంది," అని అన్నారు. విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావు మాట్లాడుతూ, మీడియా యాజమాన్యాల ఆధీనంలోకి వెళ్తోందని, స్వతంత్ర జర్నలిజాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. "భయపడి కాకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు వ్యక్తం చేసే స్వతంత్ర మీడియాను బలపరచడానికి ఐజేయూ చర్యలు తీసుకోవాలి," అని సూచించారు. ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని) సందేశాన్ని చదివి వినిపించారు. సమావేశం ప్రారంభానికి ముందు కె. శ్రీనివాస్ రెడ్డి ఐజేయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ సీనియర్ నాయకులు ఎస్ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, ఎంఎ మజీద్, కొత్తగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి డి. సోమ సుందర్, అమర్ మోహన్ ప్రసాద్, వై. నరేందర్ రెడ్డి, డీఎస్ఆర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

చమురుపై సుంకం తగ్గింపు సాహసోపేత నిర్ణయం

- కేంద్రం తన బాధ్యతను చాటుకుంది
- తక్షణమే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గించాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి28: అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, సామాన్య, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే పరమావధిగా కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గించడం ఒక సాహసోపేతమైన, జనరంజకమైన నిర్ణయం అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా దేశ ప్రజలకు అందించిన ప్రధాని నరేంద్ర మోడీ తీపి కబురు పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా 'సున్నా' కు తగ్గించడం మోదీ పరిపాలనా దక్షతకు నిదర్శనం అని అన్నారు. పెట్రోల్ పై కూడా రూ. 10 మేర భారాన్ని తగ్గించి కేంద్రం తన బాధ్యతను చాటుకుందని, మరి ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం తన బాధ్యతను ఎప్పుడు నెరవేరుస్తుంది? అని ప్రశ్నించారు. ప్రస్తుతం తెలంగాణలో వ్యాట్ సుమారు 35% ఉండటం వల్ల సామాన్యుడిపై పెను భారం పడుతోందని, కేంద్రం పన్నులు తగ్గిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన ఖజానా నింపుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు చేసిన అప్పులు, ఆయిల్ బాండ్ల భారం ఉన్నా కేంద్రం వెనక్కి తగ్గలేదని, కానీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పన్నుల రూపంలో ప్రజల రక్తాన్ని పిండుతోందని. పెట్రోల్ ధరలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటాయే ఎక్కువగా ఉండటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికైనా తక్షణమే పెట్రోల్, డీజిల్ పై వ్యాట్ తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం తన పన్ను వాటాను తగ్గిస్తేనే పెట్రోల్ ధర రూ. 100 లోపుకు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. సామాన్యుడికి నిజమైన ఊరటనివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

ఇకపై అన్ని శాఖల్లో ఈ ఆఫీస్ కార్యకలాపాలు

- అదనపు కలెక్టర్ చంద్ర రెడ్డి

ప్రతిపక్షం, రంగారెడ్డి జిల్లా, మార్చి 28: ప్రతి శాఖలో ఈఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఈఆఫీసు నిర్వహణపై జిల్లా అధికారులకు, సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి పాల్గొన్నారు. జిల్లా అధికారులందరూ ఫైళ్లన్ని ఈఆఫీస్ ద్వారా పంపే విధంగా చర్యలు చేపట్టడానికి జిల్లా అధికారులకు, శాఖల అధికారులకు సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ ట్రైనింగ్ ద్వారా అవసరమైన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని అధికారులందరూ ఏర్పరుచుకోవాలన్నారు. రాబోయే రోజులన్నీ సాంకేతిక పరిజ్ఞానం పైనే ఆధారపడి ఉంటాయని, అందువలన ప్రతి శాఖలో ఈఆఫీసు ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని, శాఖల వారీగా లాగిన్స్ పెండింగులో లేకుండా త్వరతగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖల్లలో బల్క్ ఇమెయిల్ ఐడీలను క్రీయేట్ చేసుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటి వరకు ఐడీలు క్రియేట్ కానీ ఎడల త్వరతగతిన ఏర్పాటు చేసుకోని కావాల్సిన సాంకేతిక పరిజ్ఞాణంలో అధికారులందరూ ట్రైనింగ్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా అధికారులు, ట్రైనింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలు విజయవంతం

ప్రతిపక్షం భద్రాచలం, మార్చి 28: భద్రాచలంలో రెండు రోజుల పాటు అత్యంత వైభోగంగా నిర్వహించిన శ్రీరామనవమి, మహా పట్టాభిషేక మహోత్సవాలు విజయవంతంగా ముగిసినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.స్వామివారి వేడుకలను ఘనంగా నిర్వహించడంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని ఆయన పేర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చినప్పటికీ, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు తెలిపారు.మహోత్సవాలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేసిన పాత్రికేయుల సేవలను కూడా ఆయన కొనియాడారు. అదేవిధంగా, భక్తుల కోసం ఆన్లైన్ ద్వారా ప్రత్యేక టికెట్ విక్రయాలను చేపట్టడం మంచి నిర్ణయమని అభినందించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేయడం వల్ల భద్రాచలం రాలేని భక్తులు టీవీలు, సోషల్ మీడియా ద్వారా వీక్షించే అవకాశం కలిగిందని చెప్పారు. ప్రభుత్వ ఆనవాయితీ ప్రకారం స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించినట్లు తెలిపారు. సీతారాముల కల్యాణం రోజున తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించగా, మహా పట్టాభిషేక వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించినట్లు వెల్లడించారు.వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, భక్తులకు ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేసినట్లు ఆయన ప్రశంసించారు. శ్రీరామనవమి రోజున కళ్యాణం అనంతరం భక్తుల కోసం భద్రాచలంలో 80 తలంబ్రాల కౌంటర్లు ఏర్పాటు చేసి, ఆర్టీసీ బస్సుల ద్వారా ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు.అదేవిధంగా, స్వామివారి తలంబ్రాలను కొరియర్, పోస్టల్, కార్గో ద్వారా కూడా పొందే విధంగా దేవస్థానం ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించి, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. భద్రాద్రికి వచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున సేవలు అందించి మంచినీళ్లు, మజ్జిగ, అన్నదానం చేయడం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీయే నడపాలి

- ప్రైవేటీకరణ చేస్తే ఊరుకోం
- జేఏసీ జిల్లా చైర్మన్ ఎంపీ రెడ్డి
- 30న కరీంనగర్ 2 డిపో ఎదుట భారీ ధర్నా



ప్రతిపక్షం, హుస్నాబాద్, మార్చి 28: ఆర్టీసీలోకి వస్తున్న ఎలక్ట్రిక్ బస్సులను పూర్తిగా సంస్థ యాజమాన్యం పరిధిలోనే నడపాలని, ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఎంపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో యాజమాన్యం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు కార్మికులను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం జేఏసీ ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడుతుందని స్పష్టం చేశారు.కరీంనగర్ 2 డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ధోరణిని సహించబోమని, యాజమాన్యం తన పద్ధతి మార్చుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ క్రమంలోనే తమ డిమాండ్ల సాధన కోసం ఈనెల 30న కరీంనగర్ 2 డిపో ఎదుట నిర్వహించనున్న భారీ ధర్నాను కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.యాజమాన్యం తీసుకునే నిర్ణయాలు కార్మికులకు అనుగుణంగా ఉండాలి తప్ప, వారికి వ్యతిరేకంగా ఉంటే ఊరుకునేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ కె. కొమురయ్య, కన్వీనర్ జె. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మా అన్నయ్యతో పాటు కుటుంబమంతా మద్రాసులో ఆస్తులన్నీ అమ్మేసుకొని హైదరాబాద్ వచ్చాం. హైదరాబాద్ వచ్చాక అదే సమస్య. కారణాలేవైనా కావచ్చు. కానీ ఇది మీ ఊరు కాదు, మీ రాష్ట్రం కాదు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి అన్నారు. రాష్ట్ర విభజన రాజకీయ పరమైన సమస్య అని అనుకునేవాడిని కానీ ప్రజలపైనా తీవ్ర ప్రభావం చూపింది.
- అసెంబ్లీలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

ఓపెన్ వాయిస్

భారత్ కు ఫుల్ ఎనర్జీ!

గల్ఫ్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత ప్రపంచ మార్కెట్లను అతలాకుతలం చేసింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. చమురు, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ కొరత ఏర్పడింది. పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ తీవ్ర ఇబ్బందులు పడ్డాయి. మరోవైపు భారత్‌లో చమురు కొరత లేకపోయినా ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. దీంతో కేంద్రం గృహ, కమర్షియల్ గ్యాస్ ధరలు పెంచింది. అయినా ఎల్‌పీజీ సరిపడా లేకపోవడంతో కమర్షియల్ సరఫరా నిలిపివేసింది. తాజాగా ఐదు రోజుల యుద్ధ విమరణ, భారత్ ఇరాన్‌తో జరిపిన చర్చలు, ఇరుదేశాల దౌత్య సంబంధాలతో హోర్ముజ్‌లో చిక్కుకున్న భారత నౌకలు భారత్‌కు వస్తున్నాయి. ఈ క్రమంలో భయాలను పటాపంచలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. రాబోయే 60 రోజులకు దేశ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి లోటు ఉండదని, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరా కూడా యథావిధిగా సాగుతుందని స్పష్టం చేసింది.కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశంలోని ప్రతీ పౌరుడి అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి. వచ్చే 60 రోజులకు సరిపడా స్టాక్ సిద్ధంగా ఉంది. తర్వాతి రెండు నెలలకు అవసరమైన ముడిచమురు దేశానికి చేరుతోంది. హోర్ముజ్ జలసంధి మూతపడినా, ఇతర మార్గాల ద్వారా 70% క్రూడాయిల్ సరఫరా కొనసాగుతోంది. అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర దేశాల నుంచి 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ దిగుమతికి ఏర్పాట్లు జరిగాయి. వచ్చే నెల రోజుల వరకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.ఇరాన్ యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధి వద్ద ప్రతికూల పరిస్థితులు ఉన్నా, భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న 41కి పైగా దేశాల నుంచి క్రూడాయిల్‌ను దిగుమతి చేసుకుంటోంది. ఇంతకు ముందు హోర్ముజ్ ద్వారా వచ్చిన దానికంటే ఎక్కువ ముడిచమురు ఇప్పుడు ఇతర మార్గాల్లో వస్తోంది. దేశంలోని అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) వందశాతం కన్నా ఎక్కువ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.గ్యాస్ కొరత వస్తుందనే భయంతో ప్రజలు ముందే బుక్ చేసుకోవడం వల్ల తలెత్తింది. గత కొన్ని రోజులుగా డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది.దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలిక ఆలస్యం జరిగినా, సరఫరా వ్యవస్థ పూర్తి స్థాయిలో పనిచేస్తోంది. గృహ వినియోగదారులకు వంద శాతం ఎల్పీజీ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ధ్రువీకరించిందభారత్ ఇంధన భద్రత కోసం 85 శాతం క్రూడ్ ఆయిల్ దిగుమతిని 41కిపైగా దేశాల నుంచి కొనసాగిస్తోంది. రిఫైనరీలన్నీ వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. మరోవైపు 8 లక్షల టన్నుల ఎల్‌పీజీ అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి వస్తోంది. దీంతో పెట్రోల్ 60 రోజులకు, డీజిల్ 90 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నాయి.ప్రపంచంలో ఏం జరిగినా భారత ఇంధన భద్రతకు లోటు లేదని కేంద్రం స్పష్టం చేసింది. పశ్చిమాసియా యుద్ధ కారణంగా ఇంధన సంక్షోబం ఏర్పడింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకతోపాటు భారత్ కూడా ఇబ్బంది పడుతోంది. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎల్ఎన్‌జీ ఇబ్బందులు తలెత్తాయి. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేయడంతో చమురు రవాణా ఆగిపోయింది. భారత్ దిగుమతి చేసుకునే చమురులో 40 శాతం ఈ సంధి గుండానే వస్తుంది. యుద్ధం ఇంకా పెరిగి జలసంధి పూర్తిగా మూసివేస్తే చమురు రవాణా పూర్తిగా నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్లాన్ బి సిద్ధం చేస్తోంది.ఏప్రిల్ నెలకు 6 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును రష్యా నుంచి దిగుమతి చేస్తూ భారత్ కొత్త ఒప్పందాలు ఖరారు. అమెరికా మినహాయింపుతో (30 రోజులు) తక్కువ ధరలకు సరఫరా భద్రపరుస్తోంది, ఇది దేశ ఆర్థిక భారాన్ని తగ్గిస్తుంది. దేశంలో 33 లక్షల టన్నులు పైగా చమురు, మార్కెటింగ్ కంపెనీలతో కలిపి 74 రోజుల అవసరానికి సరిపోయే స్టాక్ సిద్ధంగా ఉంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది33 కోట్ల కుటుంబాలకు వంటగ్యాస్ అందేలా దేశీయ ఉత్పత్తి 25 శాతం పెంచారు. హోటళ్లు మూతలు, అధిక కొనుగోళ్లకు ప్రజలు ఆందోళన చెందకుండా పర్యవేక్షణ పెంచారు. చమురు దిగుమతి చేసుకునే దేశాల సంఖ్యను కూడా 27 నుంచి 41 దేశాలకు విస్తరించింది. సౌదీ, యూఏఈ పైప్‌లైన్లు, అమెరికా మార్గాలు ప్రత్యామ్నాయాలుగా పనిచేస్తున్నాయి. పీఎన్‌జీ విస్తరణకు ఆదేశాలు జారీ చేసింది.ప్లాన్ బీ వల్ల ఇంధన ధరలు అదుపులో ఉంటాయి. ఆర్థిక స్థిరత్వం కాపాడుకుంటుంది. రష్యా ఆధారం పెరగడం అమెరికా సంబంధాలకు సవాల్. కానీ, దౌత్య నైపుణ్యంతో భారత్ భద్రత పటిష్టం అవుతోంది. భవిష్యత్తులో వైవిధ్యీకరణ దీర్ఘకాల రక్షణగా మారుతుంది. వ్యూహాత్మక నిల్వలు, వైవిధ్యీకృత దిగుమతి మార్గాలు, పూర్తి సామర్థ్యంతో నడుస్తున్న రిఫైనరీలు దేశాన్ని ఇంధన సంక్షోభం నుంచి కాపాడుతున్నాయి. ప్రజలు ధైర్యంగా ఉండి, పుకార్లకు భయపడకుండా సాధారణ వినియోగం కొనసాగించాలి.

ప్రతిపక్షం
హైదరాబాద్
ఆదివారం
29.03.2026

మతం మారితే వివక్ష పోతుందా?!

మతం అనేది వ్యక్తిగత విముక్తి కోసం వెత్తుకునే మార్గం కావచ్చు, కానీ కులం అనేది వ్యవస్థీకృత అణచివేత. ఈ రెండిటిని కలిపి చూడటం వల్ల అసలైన బాధితులకు అన్యాయం జరుగుతుంది. కే.జీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక కేవలం గణంకాలకే పరిమితం కాకుండా, దళిత క్రైస్తవ, ముస్లింల దైనందిన జీవితాల్లోని వివక్షను గుర్తించాలి. న్యాయవ్యవస్థ మరియు ప్రభుత్వం కూడ దళితుల స్థితిగతులను మత పరమైన కోణంలో కాకుండా సాంఘిక అణచి వేత, వెనుక బాటుతనం ప్రాతిపదికన చూసి వారికి రాజ్యాంగ పరంగా వర్తించే రక్షణ కల్పించినప్పుడే అందరికి సమాన న్యాయం అందుతుంది.

పల్లె నాగరాజు
8500431793

భారతదేశ సామాజిక ముఖచిత్రంలో 'కులం' అనేది పుట్టుకతో అంటుకునే ఒక చెరిపివేయలేని ముద్ర. షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) రిజర్వేషన్లకు సంబంధించి, దళితులు క్రైస్తవ లేదా ఇస్లాం మతాల్లోకి మారితే వారికి రిజర్వేషన్ ఫలాలు వర్తించవు అనే అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. సుప్రీం కోర్టులో విచారణలో ఉన్న ఈ అంశం ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తుతోంది: ''ఒక వ్యక్తి మతం మారగానే అతను ఎదుర్కొనే సామాజిక వివక్ష మరియు అంటరానితనం రాత్రికి రాత్రే అంతమైపోతాయా....?'' 1950 రాజ్యాంగ ఉత్తర్వు ప్రకారం, కేవలం హిందూ మతంలో ఉన్న దళితులు మాత్రమే ఎస్సీలుగా పరిగణించబడ్డారు. తర్వాతి కాలంలో సిక్కు (1956), బౌద్ధ (1990) మతాల్లోకి మారిన వారిని కూడా ఈ పరిధిలోకి చేర్చారు. అయితే, క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులను మాత్రం ఇప్పటికీ వెలుపలే ఉంచారు. ఇందుకు ప్రధాన కారణం... ఈ మతాల్లో 'కులం' లేదని, ఇవి సమానత్వాన్ని ప్రబోధిస్తాయని చెప్పడం. కానీ, క్షేత్రస్థాయిలో వాస్తవాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. క్రైస్తవ మతంలోకి మారి ఆ మత ఆచార వ్యవహారాలు పాటిస్తూ.. విద్యా, ఉద్యోగా ల కోసం మరియు రెవెన్యూ కార్యాలయం నుండి పొందే సర్టిఫికెట్ లలో హిందూ మతం గా పేర్కొనడం కచ్చితంగా అందరం వ్యతిరేకించల్సిందే. కానీ మతం వేరు కులం వేరు.మతం అనేది వ్యక్తిగత విశ్వాసానికి సంబంధించినది. కానీ కులం అనేది సామాజిక హోదా. ఒక దళితుడు క్రైస్తవ మతంలోకి మారినంత మాత్రాన, సమాజం అతడిని చూసే కోణం మారిపోవడం లేదు. మతం మారినప్పటికీ, గ్రామాల్లో వారు నివసించే ప్రాంతాలు (వాడలు), వారు చేసే అపవిత్రంగా భావించే వృత్తులు మారడం లేదు. హిందూ మతం నుండి వెళ్లి క్రైస్తవంలో చేరిన వారిని 'దళిత క్రైస్తవులు' అని పిలవడమే అక్కడ కూడా కుల వివక్ష ఉందనడానికి నిదర్శనం. చర్చిల్లో ప్రార్థనలకు, వివాహ సంబంధాలకు, చివరికి స్మశాన వాటికల్లో కూడా దళిత క్రైస్తవులకు ప్రత్యేక స్థానాలు ఉండటం ఈ చేదు నిజానికి అద్దం పడుతోంది. మతం మారిన దళితుల స్థితి గతుల గురించి అధ్యయనం చెయ్యడానికి ప్రభుత్వాలు నియమించిన వివిధ కమిషన్లు మతం మారిన దళితుల దుస్థితిని కళ్ళకు కట్టాయి. 1995 నియమించిన కాక కాలేల్కర్ కమిషన్, కేరళలోని దళిత క్రైస్తవుల మీద అధ్యయనం చెయ్యడానికి 1965 లో నియమించిన కుమార పిళ్ళే కమిటీ, 2007 నియమించిన రంగనాథ్ మిశ్రా కమిషన్, అన్ని కమిషన్ లు కూడ దళిత క్రైస్తవులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్ష, హిందూ దళితుల వివక్షతో సమానంగా ఉందని, వీరికి కూడా ఎస్సీ హోదా కల్పించాలని ఓకే రకమైన అభిప్రాయాన్ని స్పష్టం చేసాయి.2006 నియమించిన సచార్ కమిటీ ,ముస్లింలలోని దళిత వర్గాల ఆర్థిక స్థితిగతులు అత్యంత దయనీయంగా ఉన్నాయని వెల్లడించింది.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2022 నియమించిన కె.జి బాల కృష్ణన్ కమిషన్ దేశ వ్యాప్తంగా పర్యటిస్తూ మతం మారిన దళితులకు మాత్రమే ఎస్సీ హోదాను పరిమితం చెయ్యడం రాజ్యాంగ ప్రాథమిక సూత్రాలకు విరుద్ధమని అనేకమంది మేధావుల వాదన.ఒక వ్యక్తి తన మతాన్ని ఎంచుకునే స్వేచ్చ రాజ్యాంగం కల్పించినప్పుడు, ఆ ఎంపిక వలన అతనికి లభించాల్సిన రాజ్యాంగ పరమైన రక్షణలు కోల్పోవడం అనేది రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్చను శిక్షించడమే అవుతుంది. సుప్రీం కోర్ట్ తన తీర్పులో 1950 రాజ్యాంగ ఉత్తర్వులో ఎస్సీలకు మాత్రమే మాతాధారిత నిబంధనలు ఉన్నాయని, ఎస్టీలకు మాతాధారిత నిబంధనలు లేవని, ఒక ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తి కేవలం మతం మారడాని అతని ఎస్టీ హోదా రద్దు చెయ్యలేమని వివరించింది.మిగతా కులాలు మతం మారితే అతని కుల హోదా



దళితుల స్థితిగతులపై తుది నివేదికను సిద్ధం చేస్తుంది. ఈ నివేదిక పూర్తి కాకముందే సుప్రీం కోర్ట్ తీర్పును ఇవ్వడం జరిగింది. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలలో దళిత క్రైస్తవులను బీసీసీ గ్రూప్ లో చేర్చారు. దీనివల్ల వారు ఎస్సీ లకు కేటాయించిన 15 శాతం రిజర్వేషన్లను కోల్పోయి కేవలం 1శాతం ఉన్న బీసీసి కోటాలోకి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగింది. రాజ్యాంగంలోని 14,15 మరియు 16 అధికరణలు పౌరులందరికి సమానత్వాన్ని, మతప్రాతిపదికన వివక్ష చూపకూడదని హామీ ఇస్తున్నాయి. అయితే 1950 నాటి రాష్ట్రపతి ఉత్తర్వు కేవలం, హిందూ తర్వాత, బౌద్ధం (1956),సిక్కు (1990) మతాలలో ఉన్న కోల్పోకుండా కేవలం ఎస్సీలు మాత్రమే తమ హోదాను కోల్పోవడం ఏంటని దళిత వర్గాలలో తీవ్రమైన చర్చ జరుగుతుంది. మతం అనేది వ్యక్తిగత విముక్తి కోసం వెత్తుకునే మార్గం కావచ్చు, కానీ కులం అనేది వ్యవస్థీకృత అణచివేత. ఈ రెండిటిని కలిపి చూడటం వల్ల అసలైన బాధితులకు అన్యాయం జరుగుతుంది. కే.జీ బాలకృష్ణన్ కమిషన్ నివేదిక కేవలం గణంకాలకే పరిమితం కాకుండా, దళిత క్రైస్తవ, ముస్లింల దైనందిన జీవితాల్లోని వివక్షను గుర్తించాలి. న్యాయవ్యవస్థ మరియు ప్రభుత్వం కూడ దళితుల స్థితిగతులను మత పరమైన కోణంలో కాకుండా సాంఘిక అణచి వేత, వెనుక బాటుతనం ప్రాతిపదికన చూసి వారికి రాజ్యాంగ పరంగా వర్తించే రక్షణ కల్పించినప్పుడే అందరికి సమాన న్యాయం అందుతుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

సుప్రీం తీర్పు.. మతం పేరుతో దళితులపై దాడి

సంపతి రమేష్
7989579428

ఇటీవల కాలంలో భారతదేశంలో చారిత్రకంగా వెనుకబాటు గురైన అట్టడుగు వర్గాలు తమ వాటా కోసం ఉద్యమిస్తున్నారు. సంపద, భూమి, రాజ్యం, రిజర్వేషన్ హక్కులపై గళ మెత్తుతున్నారు. మరోవైపు అట్టడుగు వర్గాల రాజ్యాంగ రిజర్వేషన్లను, చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి. ఇటీవల సుప్రీంకోర్టు దళితులు మతం మారితే రిజర్వేషన్లు కోల్పోతారని, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తించదనే తీర్పు ఇందుకు నిదర్శనమే. దళితుల క్రైస్తవులపైన, హిందూ దళితుల మీద ఇవ్వబడిన ఈ తీర్పు భారత రాజ్యాంగం మౌలిక సూత్రాలకు విరుద్ధమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లోని 2021 జనవరి 21న బాపట్ల జిల్లా, కొత్తపాలెం గ్రామంలో అగ్రకులం వ్యక్తుల చేతిలో దాడికి గురైన ఓ దళిత పాస్టర్ వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశాడు. మతం మారిన ఫాస్టర్ కు ఎస్సీ హోదా వర్తించదని, తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని ఏపీ హైకోర్టులో నిందితులు పిటిషన్ దాఖలు చేశారు. అప్పుడు కోర్టు క్రైస్తవ మతం మారిన వ్యక్తికి ఎస్సీ , ఎస్టీ అట్రాసిటీ చట్ట రక్షణలు వర్తించవని తీర్పించింది. ఈ తీర్పును ఆ ఫాస్టర్ సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఇటీవల 2026, మార్చి 24న అత్యున్నత న్యాయస్థానం కూడా సమర్థించింది. దీనికి ఆధారం అంబేద్కర్ మతం మారకుండా తెచ్చిన 1950 రాజ్యాంగ ఉత్తీర్వులే.

రిజర్వేషన్స్ కు రాష్ట్రపతి ఉత్తర్వులు ఆధారమా? రాజ్యాంగం ఆధారమా?

భారతీయ హిందూమతంలోని అస్పృశ్యత అంటరానితనంపై సుదీర్ఘంగా పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్. ఆయన 1935లో మహారాష్ట్ర, నాసిక్ జిల్లా దగ్గరలో ఉన్న ఓలా మహాసభలో "నేను హిందువుగా పుట్టాను, కానీ హిందువుగా చనిపోను" అని ప్రకటించాడు. ఈ క్రమంలో అంబేద్కర్ మతం మారడాన్నీ అడ్డుకునేందుకు 1950, ఆగస్టులో రాష్ట్రపతి ఆర్డర్(షెడ్యూల్ క్యాస్ట్) తీసుకువచ్చారు. ఈ ఆర్డర్, కేవలం హిందూ మతంలో ఉన్న దళితులను మాత్రమే ఎస్సీలుగా పరిగణించారు. అంబేద్కర్ షెడ్యూల్డ్ క్యాస్ట్ కాబట్టి షెడ్యూల్ క్యాస్ట్ ఆర్డర్స్ తీసుకొచ్చారు. అనంతరం సిక్కు (1956), బౌద్ధ (1990) మతాల్లోకి మారిన వారిని సైతం ఈ పరిధిలోకి చేర్చారు. అయితే, క్రైస్తవ, ఇస్లాం మతాల్లోకి మారిన దళితులను మాత్రం ఇప్పటికీ వెలుపలే ఉంచారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ప్రకారం ఒక వ్యక్తి క్రిస్టియన్ పేరు పెట్టుకుంటే, బైబిల్ పట్టుకుంటే, ఏసుక్రీస్తు ఫోటో పెట్టుకున్న, చర్చికి వెళ్లినంత మాత్రాన అతను క్రిస్టియన్ కాదు. తనకు తాను స్వయంగా ప్రకటించుకుంటేనే క్రిస్టియన్. అప్పుడే అతనికి రిజర్వేషన్స్, అట్రాసిటీ చట్టం వర్తించదు. ఈ విషయాన్ని పలు కేసుల్లో కోర్టులు వాక్యానించాయి.

కానీ ఇటీవల సుప్రీంకోర్టు జడ్జిమెంట్ లో పాస్టర్ తనకు తానే క్రిస్టియన్ అని ప్రకటించుకున్నాడు. కాబట్టి ఈ తీర్పు కూడా ఆ పాస్టర్ కే వర్తిస్తుంది. అందరికీ కాదు. రాజ్యాంగం పరంగా ఆర్టికల్ 15 మతం, కులం, భాష, లింగం అనే తేడా లేకుండా సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 25 మత స్వేచ్ఛకు హామీ ఇస్తుంది.

మతం మారిన వివక్ష ఆగలేదు

భారతదేశంలో పీడిత వర్గాల కోసం తెచ్చిన రాజ్యాంగ రిజర్వేషన్లు, చట్టాలు, మతపరమైన సౌకర్యాలు కావు—అవి శతాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక అన్యాయానికి పరిహారం. అయినప్పటికీ కులభారతంలో దళితులు మతం మారిన వివక్షత ఆగలేదు. ఆంధ్రప్రదేశ్ లో కారంచేడు, చుండూర్ దళిత క్రిస్టియన్ లపైన జరిగిన దాడి చరిత్రలో మాయని మచ్చలుగా నిలిచాయి. దళితులు మతం మార్చుకుంటే వారి జీవితాల్లో గౌరవం, సమానత్వం రాదని ఈ అమానుష ఘటనలు రుజువు చేశాయి. ఈ సంఘటలతో ఎస్సీ , ఎస్టీ అట్రాసిటి చట్టం తెరపైకి వచ్చింది. ఇప్పుడు మతం పేరుతో ఈ చట్టాన్ని కూడా వర్తింపచేవద్దనడం గమనార్హం. అదే విధంగా హిందూ సమాజంలోనీ దళిత, వెనుకబడిన వర్గాలు కూడా వివక్ష నుంచి తప్పించుకోవడం లేదు. తెలంగాణలో కుమ్మెర ఘటన, కర్ల రాజేష్ పై దాడి ఇందుకు నిదర్శనం. వివక్ష అనేది కేవలం మతానికి పరిమితం కాదు—అది సామాజిక నిర్మాణంలో, మనుషుల మనస్తత్వంలో, బలంగా పాతుకుపోయిన వ్యవస్థ. ఈ నేపథ్యంలో, "దళితులు క్రైస్తవ మతం స్వీకరిస్తే వారికి రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు వర్తించవు" అనే వాదన ఎంత అమానుషమో స్పష్టమవుతోంది. కావున మతం మారిందనే కారణంతో అతనికి రాజ్యాంగం ఇచ్చిన హక్కులను నిరాకరించడం అంటే బాధితుడినీ మళ్ళీ బాధితున్ని చేసి శిక్షించడమే. ఇదీ అంతిమంగా దళిత క్రిస్టియన్‌ను భయపెట్టించడం, దళిత హిందువులను ప్రలోభాలకు గురిచేయడమే.

రాష్ట్రపతి ఉత్తర్వులు రద్దు చేయాలి

1950 రాష్ట్రపతి ఉత్తర్వులపై గతంలో UPA గవర్నమెంట్ జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమీషన్ ఏర్పాటు చేసింది. రిపోర్ట్ సమర్పించింది. అయినప్పటికీ కాలయాపన చేయడానికి BJP గవర్నమెంట్ జస్టిస్ K.G బాలకృష్ణన్ కమీషన్ నియమించింది. ఈ కమీషన్ రిపోర్ట్ లను బయటికి రానివ్వకుండా రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇస్తుంది? అంతేకాకుండా రాష్ట్రపతి ఆర్డర్ పై సుప్రీంకోర్టులో 2004 నుంచి పలు ప్రజా ప్రయోజన వాజ్యాలు వేశారు. ఇవీ బెంచి మీదకి రాకుండానే అడ్డుకుంటున్నారు. వాస్తవంగా రాష్ట్రపతి ఆర్డర్ ఆరు నెలల్లోపు చట్టంగా మారితేనే నిలుస్తుంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ళైనా ఈ ఆర్డర్ చట్టంగా మారలేదు. అయినా దీని ఆధారంగానే సుప్రీం కోర్టు తీర్పినీవ్వడం భారత రాజ్యాంగ హక్కులను కాలరాయడమే. ఒక అగ్రకులం వ్యక్తి క్రిస్టియన్ గా మారిన అతను ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోల్పోడు. అతని అగ్రకుల హోదా పోదు. అంతే కాకుండా ఒక బీసీ, ఎస్టీ సైతం క్రిస్టియన్ గా మారిన తమ రిజర్వేషన్లు, రక్షణలు పోవు. కానీ మతం మారిన దళితుల మాత్రమే రిజర్వేషన్స్, చట్టపరమైన రక్షణలను కోల్పోవడం వివక్ష కాదా? ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం కాదా? సుప్రీంకోర్టు తీర్పు మతం పేరుతో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తున్నట్టు కాదా ?ఇదంతా ఆధిపత్యం వర్గాల ఆధ్వర్యంలో జరుగుతున్న వ్యవస్థాపక అణిచివేత. ఈ ప్రమాదం కేవలం దళిత క్రిస్టియన్లకే పరిమితం కాదు. భవిష్యత్తులో ఆదివాసులపై కూడా జరుగుతాయి. ఇప్పటికే ఒరిస్సా, ఈశాన్య రాష్ట్రాల్లో మతంపేరుతో ఆదివాసులపై దాడులు జరుగుతున్నాయి. రేపు బీసీలపై కూడా జరిగే అవకాశం లేకపోలేదు. అంతిమంగా హిందు బీసీ ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగపరమైన, చట్ట పైనమైన రక్షణలను మతం పేరుతో నీరుగార్చే ప్రమాదం పొంచి ఉంది. ఇవి ఆగాలంటే అంబేద్కర్ మతాంతరం చెందకుండా ఆపడానికి కుట్రపూరితంగా తెచ్చిన 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ను రద్దు చేయాలి. అప్పుడే రాజ్యాంగ స్ఫూర్తి వర్ధిల్లుతుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

పీఆర్‌సీ నివేదిక పై జాప్యమేల?

జి .తిరుపతిరెడ్డి
9866306366

2023 శాసనసభ ఎన్నికల ముందు 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు 7డిసెంబర్ 2023 నాడు చేపట్టింది .కొత్త ప్రభుత్వం ఏర్పడి 27 నెలలు గడుస్తున్న దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న ముఖ్యమైన అనేక ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర జాప్యాన్ని ప్రదర్శిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నది. విద్యారంగంలో మాత్రం కొంత రూటు మార్చి కొత్త సమస్యలను సృష్టిస్తున్నది. రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు ముందు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి గారు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మా ప్రభుత్వం రాగానే కొత్త పి.ఆర్.సిని ప్రకటించి ఆరు నెలలలోగా సిఫారసులను అమలు చేస్తానని హామీ ఇచ్చారు ,కానీ నేటి వరకు సిఫారసులు కమిషన్ నుండి తెప్పించుకోలేదు , పైగా మొదటి వాయిదా ఏప్రిల్ 2024 నుండి అక్టోబర్ 24 వరకు ఆరు నెలలు, రెండవ వాయిదా అక్టోబర్ 24 నుండి31 మార్చి2026 వరకు, మూడవ వాయిదా మార్చి 2026 నుండి 30 సెప్టెంబర్ 2026 వరకు ముచ్చటగా మూడోసారి వాయిదా వేసి ఉపాధ్యాయ ,ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురి చేశారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు వేతనాలను స్థిరీకరించి తాజాగా వేతనాలను సవరించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వేతన సవరణ సంఘం సిఫారసులు చేయాల్సిన అవసరం ఉంటది .వేతన సవరణ సంఘం ప్రతిపాదించే పిఆర్సి తాజా ద్రవ్యోల్బణం ,ఐదేళ్లలో ధరల స్థిరీకరణ ,సూచికను పరిశీలించాలి, గత పిఆర్సి నివేదికలను పరిశీలించి, లోపాలను సవరించి ,వేతన సవరణ తేదీ నాటికి ఉన్న మూలవేతనం ,కరువు భత్యం ,ఫిట్మెంట్లను కలిపి వచ్చిన మొత్తాలను తాజాగా మూల వేతనాలుగా పూర్తి చేసి తాజా మాస్టర్ స్కేల్, ఇంక్రిమెంట్లు శాస్త్రీయంగా ప్రతిపాదించాల్సిన ఆవశ్యకత కమిటీకి ఉంటుంది. పి ఆర్ సి లు రూపుదిద్దుకోవడం కోసం ఉద్యోగ ,ఉపాధ్యాయ సంఘాలు అనేక పోరాటాలు చేసి తమ హక్కుగా సాధించుకున్నారు. అలాంటి హక్కును కాలరాసే ప్రయత్నాన్ని ప్రభుత్వాలు విడనాడుకోవాలి. పీఆర్సీల మధ్య సంవత్సరాలుగా జాప్యాలను నివారించాలి ఉద్యోగ ,ఉపాధ్యాయ, పెన్షనర్ల పొట్ట కొట్టకూడదు. తెలంగాణ రాష్ట్రంలో మొదటి పీఆర్సీ గడువు 2023 జూన్ 30వ తేదీతో ముగిసింది. 1 జులై 2023 నుండి రెండో పీఆర్సీని ఇవ్వాల్సి ఉంది .కేసీఆర్ సర్కార్ 2 అక్టోబర్ 2023న రిటైర్ ఐఏఎస్ ఆఫీసర్ ఎన్. శివశంకర్ ని చైర్మన్‌గా నియమిస్తూ వేతన సవరణ సంఘాన్ని నియమించింది. ఆరు నెలల్లోగా రిపోర్టు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది .అనేక పర్యాయాలు చర్చించి ఉద్యోగ సంఘాల నుండి ప్రతిపాదనలు స్వీకరించింది. సుదీర్ఘ కసరత్తు తరువాత కొన్ని నెలల క్రితమే పిఆర్సి నివేదిక సిద్ధమైంది. రిపోర్టును సమర్పించేందుకు అధికారులు ప్రభుత్వ అనుమతి కోరారు .కానీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదు సరి కదా ఉద్యోగ వర్గం కండ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చింది .రాష్ట్ర ప్రభుత్వం 2026 బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయిస్తారని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశించారు ,కానీ అందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం 3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 26,674 కోట్లు (8.22%) కేటాయించింది. అందులో పిఆర్సి ఊసే ఎత్తకుండా ఉద్యోగ ,ఉపాధ్యాయ వర్గాలలో నిరాశ నిస్పృహలకు లోనయ్యేవిధంగా వ్యవహరించింది. తెలంగాణ మొదటి పి ఆర్ సి సిఆర్ బిశ్వాస్ చైర్మన్గా 2018లో మే 18న కమిటీ ఏర్పాటు చేసి ,2021 నుండి 43% ఫిట్మెంట్తో పిఆర్సి ని అమలు చేసింది ,ప్రభుత్వంపై ఏడాదికి 12,595 కోట్ల అదనపు భారం పడిన కరోనా కష్టాలు వెంటాడిన , రాష్ట్ర అభివృద్ధిలో ఉపాధ్యాయ, ఉద్యోగుల పాత్రను గుర్తించి భారాన్ని భరించేందుకు సిద్ధపడ్డది, ఉద్యోగ ,ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఈ సమాజంలో అంతర్భాగమే మూడు, నాలుగు దశాబ్దాల పాటు సమాజాభివృద్ధిలో, విద్యాభివృద్ధిలో ఎనలేని సేవ చేసి తమ రక్తాన్ని చెమటగా ధారపోసి ప్రజలకు సేవ చేస్తున్నారు, ఇలాంటి వర్గాల వారిని చిన్నచూపు చూడడం వారి పరిస్థితిని అర్థం చేసుకోకపోవడం సరైంది కాదు. సెప్టెంబర్ 2026 వరకు పిఆర్సి నివేదికను వాయిదా వేయడం సరైన పద్ధతి కాదు. వెంటనే ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకొని పిఆర్సి నివేదికను తెప్పించుకొని ఐదు శాతం ఐ ఆర్ తో పాటు 40% ఫిట్మెంట్ తో 1 జులై 2023 నుండి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. లేనియెడల ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల నుండి తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుంది.

(వ్యాసకర్త టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)

తెలంగాణ జాగృతిలోకి భారీగా చేరికలు

- రాష్ట్రంలో రాజకీయ శూన్యతను పూరిస్తున్న కవిత నాయకత్వం



ప్రతిపక్షం ,మొయినాబాద్, మార్చి 28 : తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కుమ్మరి శివశంకర్ ఆధ్వర్యంలో చేవెళ్ళ , కల్వకుర్తి నియోజకవర్గాలకు చెందిన వివిధ పార్టీల నుండి సుమారు 100 మందికి పైగా ముఖ్య నాయకులు, కార్యకర్తలు తెలంగాణ జాగృతిలో చేరారు. తెలంగాణ జాగృతి కార్యనిర్వాహక అధ్యక్షుడు రూప్ సింగ్, రాష్ట అధికార ప్రతినిధి నల్లమల్ల శ్రీకాంత్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు దూకుంట్ల నరేష్, వరలక్ష్మి, శ్రీనివాస్ తదితర నేతలు కొత్తగా చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, జాగృతి రంగారెడ్డి జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు కుమ్మరి శివకుమార్ లు మాట్లాడుతూ రాజకీయ ప్రత్యామ్నాయం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం ఒక కీలకమైన సంధిదశలో ఉందని, ప్రజలు ఆశిస్తున్న అభ్యుదయకరమైన నాయకత్వాన్ని అందించేందుకు కల్వకుంట్ల కవిత నాయకత్వంలోని 'తెలంగాణ జాగృతి' సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఉద్యమ కాలం నుండి తెలంగాణ సంస్కృతిని, అస్తిత్వాన్ని ప్రపంచ వ్యాప్తం చేయడంలో కవిత పోషించిన పాత్ర అసామాన్యమైనదని, ఇప్పుడు అదే స్ఫూర్తితో ఒక బలమైన రాజకీయ ప్రత్యామ్నాయంగా ఈ పార్టీ ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని, యువత, మహిళలు, బడుగు బలహీన వర్గాలకు ఈ ప్రయాణం ఒక పెద్ద భరోసా అని ఆయన అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత రాజకీయ గందరగోళానికి తెరదించి, ప్రగతిశీల మార్గంలో తెలంగాణ ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయబోతున్నట్లు వెల్లడించారు.పార్టీలో చేరిన వారిలో సంగేరి నగేష్, పుట్నాల పరమేష్ గౌడ్, గుణాల మాధవ రెడ్డి, గౌరవ్ కుమార్, గౌరవ్ మల్లేష్, తుమ్మలూరు అంజయ్య, గోల రాజు, వీరేష్, సంజీవ రెడ్డి, నగేష్, షణ్ముఖ్ కుమార్, విశాల్, శివరామకృష్ణా రెడ్డి, కార్తీక్ రెడ్డి, ఆనంద్, తదితర ముఖ్య నేతలు ఉన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపకరిస్తాయి

- ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రతిపక్షం, చేవెళ్ల, మార్చి 28: క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక ధారుఢ్యానికి ఎంతగానో ఉపకరిస్తాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులో వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి టోర్నమెంట్ లో పాల్గొనడం వల్ల గ్రామీణ క్రీడాకారులోని ప్రతిభ వెలికి తీసే అవకాశం దొరుకుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నాయకులు వెంకట్ రెడ్డి, బండారు ఆగిరెడ్డి, వార్డ్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సర్పంచులపై మంత్రి వివక్ష

- సీసీ రోడ్ల మంజూరులో జాప్యం చేస్తున్న ప్రభుత్వం
- గ్రామాల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి
- అక్కన్నపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు భూక్య కృష్ణ నాయక్

ప్రతిపక్షం, అక్కన్నపేట, మార్చి 28: బీఆర్ఎస్ సర్పంచులపై స్థానిక ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ వివక్ష చూపుతున్నారని, గ్రామాల అభివృద్ధికి సహకరించడం లేదని అక్కన్నపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు భూక్య కృష్ణ నాయక్ ఆరోపించారు.ఈ సందర్భంగా అక్కన్నపేటలో శనివారం సర్పంచుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మేము కూడా హుస్నాబాద్ నియోజకవర్గంలో నే ఉన్నామని, బీఅర్ఎస్ మద్దతుతో గెలిస్తే మాపై ఎందుకింత వివక్ష చూపుతున్నారో తెలియదని, గ్రామాల అభివృద్ధికి అధికారులు సైతం సహకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈజీఎస్ వర్క్ లో భాగంగా సీసీ రోడ్ల మంజూరు విషయంలో కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన సర్పంచులు ఉన్న గ్రామాలలోనే సీసీ రోడ్లను మంజూరు చేయడం జరిగిందని, బీఆర్ఎస్ మద్దతు సర్పంచులు గా ఉన్న అక్కన్నపేట మండలం లోని గ్రామాలైన మైసమ్మ వాగు తండా, జనగామ. కట్కూరు, కపూర్ నాయక్ తండ. గోవర్ధనగిరి గ్రామాలకు అసలు సీసీ రోడ్లనే మంజూరు చేయలేదని అన్నారు.ఈ గ్రామాలకి ఎందుకు మంజూరు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రేగొండ, మల్చేరు తండా. గ్రామాలకి సీసీ రోడ్లను మంజూరు చేసినప్పటికీ, ఈ గ్రామాలకు సంబంధించిన సర్పంచ్లను బిల్లులను జనరేట్ చేసే విషయంలో అధికారులు నానా ఇబ్బందులు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. వెంటనే మా గ్రామాలకు కూడా సీసీ రోడ్లను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. లేకపోతే హుస్నాబాదులోని మంత్రి క్యాంప్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

వీర్లపల్లిలో విద్యుత్ కష్టాలకు చెల్లు

ప్రతిపక్షం, షాద్ నగర్, మార్చి 30 : ఎమ్మెల్యే స్వగ్రామమైన వీర్లపల్లిలో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేయడంతో స్పందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మూడు కొత్త 100 కేవీ ట్రాన్స్ ఫార్మర్లు, జంక్షన్ నుంచి వీర్లపల్లి గ్రామానికి నేరుగా 40 స్తంభాలతో ప్రత్యేక లైను, పాత స్తంభాల స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు చంద్రశేఖర్ గౌడ్, నవాజ్ రెడ్డి, చిందం నరసింహులు, ప్రభాకర్ రెడ్డి, చాకలి నరసింహ, ఎండి హైమాద్, దుబ్బ లక్ష్మయ్య, చాకలి శ్రీశైలం, కల్వకోలు రాఘవేంద్ర, చాకలి శ్రీనివాస్, పాలకొండ శ్రవణ్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శిరస్త్రాణం.. ప్రాణకవచం!

- అజీజ్ నగర్ వద్ద ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

ప్రతిపక్షం,మొయినాబాద్, మార్చి 28 : రహదారి నిబంధనలు పాటించని వాహనదారులపై చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. శనివారం మండల పరిధిలోని అజీజ్ నగర్ గేట్ వద్ద చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సతీష్ ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా శిరస్త్రాణం (హెల్మెట్) ధరించాలని, ఇది పోలీసుల కోసం కాదని, వారి ప్రాణరక్షణ కోసమేనని స్పష్టం చేశారు. కేవలం జరిమానాలతో సరిపెట్టకుండా, నిబంధనలు ఉల్లంఘించిన వారికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ ఇచ్చారు. అతివేగం ప్రమాదకరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌కార్ లేక్ సిటీ ముందు

ప్లాట్ కొనుగోలుదారుల ధర్నా

- ఐదేళ్లు గడిచినా ప్లాట్లు ఇవ్వరా?
- అడిగిన వారికి భయభ్రాంతులకు గురించేస్తున్న నిర్మాణ సంస్థ
- న్యాయం చెయ్యాలని బాధితుల డిమాండ్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 28 : సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ పరిధిలోని ఇన్‌కార్ లేక్ సిటీ బహుళ అంతస్తుల నిర్మాణాల వద్ద శనివారం రోజు ఉద్రిక్తత నెలకొంది. తమకు రావాల్సిన ప్లాట్లను వెంటనే అప్పగించాలని డిమాండ్ చేస్తూ కొనుగోలుదారులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. యాజమాన్య వైఖరికి నిరసనగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. 20192020 సంవత్సరాల్లోనే ప్లాట్లు కొనుగోలు చేసినప్పటికీ, ఇప్పటి వరకు వాటిని స్వాధీనం చేయకుండా ఇన్‌కార్ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోందని, పూర్తి చేసి అప్పగిస్తామన్నా సమయానికి ఇవ్వడం లేదని బాధితులు ఆరోపించారు. 2024లో ప్లాట్లు అప్పగిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు మీటింగ్‌ల పేరుతో కాలయాపన చేస్తున్నారని, ప్రస్తుతం పెట్టుబడికి బడ్జెట్ లేదని అంటున్నారని, వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో కొనుగోలు చేసిన వారు 700 పై చిలుకు ఉండగా ప్రస్తుతం సుమారు 450 మంది బాధితులు ఇక్కడ ఉన్నారని, అందరి పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వారు పేర్కొన్నారు. ఈ నిర్మానాల సంస్థకు రెండు వేర్వేరు ఆర్ఈఆర్ఏ (RERA) నంబర్లు ఉన్నాయని, నిబంధనల సాకుతో తమను తిప్పుకుంటున్నారని బాధితులు ఆరోపించారు . మేము కష్టపడి సంపాదించిన డబ్బును ప్లాట్ల కోసం పెట్టుబడిగా పెట్టాం. కానీ ఏళ్లు గడుస్తున్నా ప్లాట్లు ఇవ్వకుండా సంస్థ యాజమాన్యం మమ్మల్ని మోసం చేస్తోంది."తమ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, విచారణ జరిపించాలని బాధితులు కోరారు. తక్షణమే తమ ప్లాట్లను తమకు దక్కేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన సర్పంచ్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 28: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని నందు పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేశపాగ నరసింహ ఇందిరమ్మ పథకం కింద మంజూరైనటువంటి ఇండ్ల పురోగతి పరిశీలించిచారు. ఇంకా ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే వాళ్ళు ఉంటే ప్రతి ఒక్కరికి వచ్చేలా చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ఉంటూ ప్రతి ఒక్కరికి సొంత ఇల్లు ఉండాలి అనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో, డివిజనల్ ఇంజనీర్ భిక్షు నాయక్, ఎ. ఈ చైతన్య కుమార్, ఉప సర్పంచ్ షేక్ ఎజాస్, పంచాయతీ కార్యదర్శి సొంటి జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 28 : జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా కక్షిదారుల పెండింగ్ కేసులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర, జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ లోక్ అదాలత్ వేదికగా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని తెలిపారు. దీంతో కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సూచించారు. పెండింగ్ కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని చంద్ర మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు ప్రజలకు త్వరిత, తక్కువ వ్యయంతో న్యాయం అందించే సమర్థవంతమైన వేదికలని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జిగా సేవలందిస్తున్న ఆమె, ఇరువర్గాలు పరస్పర అంగీకారంతో వివాదాలను పరిష్కరించుకోవడం ద్వారా కోర్టులపై భారం తగ్గడమే కాకుండా సామరస్య వాతావరణం నెలకొంటుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవాలి

- స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 28 : క్రీడాభివృద్ధిలో భాగంగా , స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని రాజీవ్ పార్క్‌లో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను శనివారం టీజీఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీఐసీ చైర్పర్సన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ పార్క్ పక్కన ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 20 లక్షల వ్యయంతో ఈ పూల్‌ను పునరుద్ధరించినట్లు తెలిపారు. యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడానికి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడానికి ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్పర్సన్ చై కూన వనిత సంతోష్‌మాట్లాడుతూ... సుమారు పది సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ స్విమ్మింగ్ పూల్ సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి పూల్‌ను మరమ్మతులు చేయించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. పట్టణ ప్రజలకు మెరుగైన క్రీడా వసతులు కల్పించడం తమ లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని క్రీడా సదుపాయాలు అభివృద్ధి చేస్తామని తెలిపారు. యువజన సంక్షేమశాఖ మరియు స్పోర్ట్స్ అథారిటీ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ పిల్లల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో స్విమ్మింగ్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తుందని పేర్కొన్నారు. స్విమ్మింగ్ పూల్‌ను పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంచుతూ నెలవారీ, మూడు నెలల, ఆరు నెలల కార్డుల రూపంలో రేట్లు నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి వయస్సు వారికి అనుకూలంగా సమయాలను కూడా కేటాయించినట్లు వెల్లడించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా పిల్లలు, యువత పాల్గొనాలని అఖిలేష్ రెడ్డి కోరారు. స్విమ్మింగ్ ద్వారా ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు క్రీడా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, క్రీడా విభాగం సిబ్బంది, కౌన్సలర్స్ , ప్రజాప్రతినిధులు , క్రీడాభిమానులు ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్య

- జూల్కల్ గ్రామంలో విషాదం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 28 : సంగారెడ్డి జిల్లా కంది మండలం జూల్కల్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికుల వివరాల ప్రకారం, కుటుంబ సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన మహిళ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సంగారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు పిల్లలకు గొంతు నమిలి చంపేసి, తల్లి ఆత్మహత్య చేసుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు కారణమని స్థానికుల ఆరోపిస్తున్నారు. భర్త రెండు నెల క్రితం మృతిచెందగా ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపంతో ఈ ఘటనకు పాల్పడిందని సమాచారం. మృతులు... తల్లి మమత, కుమారుడు మణికంట (5), కూతురు ప్రణయ శ్రీ (4) గా పోలీసులు గుర్తించారు. ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. ఆత్మహత్యకు గల అసలు కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని డిఎస్పీ సత్తయ్య తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో గ్రామస్థులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కుటుంబ సమస్యలపై సరైన పరిష్కారం లేకపోవడం ఇలాంటి దుర్ఘటనలకు దారితీస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పశ్చిమాసియాలో యుద్ధంతో అనేక దేశాల్లో ఆహారం, ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం పడింది. ఈ సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. పౌరులంతా ఐక్యంగా, ప్రశాంతంగా ఉండాలి. భయాందోళనలు రేకెత్తించే తప్పుడు ప్రచారాలు చేయొద్దు.

- ప్రధాని నరేంద్ర మోడీ

వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చి 28: మద్నూర్ లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన స్కూల్‌లోని స్టోర్ రూమ్‌ను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. ముఖ్యంగా గుడ్ల పరిమాణం, నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, స్వయంగా గుడ్లను తూకం వేసి వాటి బరువును పరిశీలించారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా గుడ్ల బరువు ఉందో లేదో తనిఖీ చేస్తూ, తక్కువ బరువుతో సరఫరా అవుతున్నాయా అన్న అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తక్కువ బరువుతో గుడ్లు సరఫరా అయితే సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ, సరఫరాలో నాణ్యత లోపాలు ఉంటే గుత్తేదారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి అందుతున్న ఆహారం, వసతులపై ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, విద్యార్థులకు పోషకాహారం అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్కూల్ లో శుభ్రత, ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, డీసీవో రామ్మోహన్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

వ్యభిచార గృహాలపై సీసీఎస్ టీం మెరుపు దాడి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 28: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి గాయత్రి నగర్లో వ్యభిచార గృహాలపై సీ సీ ఎస్ పోలీసులు దాడులు చేసి నలుగురిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ ఇంచార్జ్ మస్తాన్ వాలి ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది వ్యభిచారం జరుగుతున్న ఇంటిపై దాడులు చేశారు.ఈ దాడులలో ఇద్దరు విటులు, ఇద్దరు మహిళలు,వారి వద్ద నుండి 5 మొబైల్ ఫోన్లు, రూ.5690 లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వీరందరినీ నాల్గో టౌన్పో లీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు అప్పగించారు.

పేకాట స్థావరంపై సీసీఎస్ టీం దాడి

నగరంలోని ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్‌లో పేకాట స్థావరంపై సీసీఎస్ సిబ్బంది మెరుపు దాడులు చేసింది. శనివారం నిజామాబాద్ పోలీస్ కమీషనర్ పి.సాయి చైతన్య, ఆదేశాల మేరకు సీసీఎస్ ఏసీపీ మస్తాన్ వలీ ఆధ్వర్యంలో సీసీఎస్ సిబ్బంది ఆరవ పోలీస్ స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ లో పేకాట స్థావరంపై రైడ్ చేసి 8మంది పేకాట రాయుళ్ళు, 7సెల్ ఫోన్, రూ.5300లు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వోకు అప్పగించారు.

ఆకట్టుకున్న 'కాకతీయ' విద్యార్థుల రోబోటిక్ ప్రదర్శన

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 28 : జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యాసంస్థలకు చెందిన కాకతీయ బలంపియాడ్ పాఠశాల విద్యార్థుల రోబోటిక్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శనివారం నగరంలోని శ్రీరామ గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమాన్ని, పాఠశాల డైరెక్టర్ రామోజీరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయ విద్యాసంస్థలకు చెందిన ప్రగతి నగర్ క్యాంపస్, సుభాష్ నగర్ క్యాంపస్, కేవోఎస్ఐ 20 క్యాంపస్ లకు సంబంధించిన సుమారు 350 పైగా ప్రాజెక్టులను తయారు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేలా గత కొన్ని సంవత్సరాలుగా ఈ రోబో ఫెస్ట్ ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలాగ ప్రాజెక్టులను తయారు చేసి ప్రదర్శించడాన్ని అభినందించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుండే రోబోటిక్స్ పై నూతన పద్ధతుల్లో శిక్షణ ఇస్తున్నామని, నూతన టెక్నాలజీకి అనుగుణంగా 3డీ డిజైన్లు చేయడం, సెన్సార్లు, గేమ్స్ కోడింగ్ చేయడం వంటివి గొప్పవని డైరెక్టర్లు తెలుపుతూ విద్యార్థుల్ని అభినందించారు. రెండు రోజుల పాటు నిర్వహించబడే ఈ కార్యక్రమంలో మొదటి రోజే పెద్ద ఎత్తున తల్లిదండ్రులు, ప్రజలు హాజరై విద్యార్థుల ప్రతిభను చూసి సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఈ ఫెస్ట్ లో పాఠశాల డైరెక్టర్లు రజినీకాంత్, రాజా, తేజశ్విని, ప్రిన్సిపాల్ లు చంద్రశేఖర్, గిరిధర్ రాజ్, రవికాంత్, సుచరిత, వైస్ ప్రిన్సిపాల్ లు భావన, భూపాల్, కోఆర్డినేటర్లు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, పాల్గొన్నారు.

శ్రీనిధిలో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 28 : 2024 25 వ ఆర్థిక సంవత్సరము ఫైనాన్స్ నియర్ లో రాష్ట్రంలో శ్రీనిధి లో నిజామాబాద్ జిల్లా మొదటి స్థానం దక్కింది. శనివారం హైదరాబాద్ లో 13వ వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రగతి సాధించినందుకు మంత్రి ధనసరి సీతక్క సెర్ప్ సీఈవో దివ్య రాజన్, స్త్రీ నిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి డి సాయి గౌడ్ బహుమతిని అందుకున్నారు. గడిచిన 10 సంవత్సరాలు నుండి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానముగా నడిపిస్తున్న సెర్ప్ సిబ్బంది, స్త్రీ నిధి సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. గత సంవత్సరము రూ.211కోట్ల లక్ష్యం ఉండగా, రూ.216 కోట్ల లక్ష్యాన్ని పూర్తి చేయడం జరిగింది. రాబోయే రోజుల్లో కూడా ప్రణాళిక ద్వారా 100 శాతం చేసే విధంగా ప్రణాళికలు చేస్తూ అమలు చేయుటకు గాను నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ నిజామాబాద్ జిల్లా అన్ని మండల సమైక్యల అధ్యక్షులు హాజరు అయ్యారు. శ్రీనిధిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో కమ్మర్పల్లి మండల సమైక్య అప్పులు తీసుకోవడంలో తిరిగి చెల్లించడంలో మొదటి స్థానం సాధించింది. ఈ సమైక్యలో పనిచేసిన ఏపిఎం గంగారెడ్డి అదేవిధంగా మండల సమైక్య అధ్యక్షులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ బడ్జెట్ ఆమోదం

- బడ్జెట్ సమావేశానికి పీసీసీ చీఫ్ ఎమ్మెల్సీ మహేష్, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ హాజరు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 28 : నిజామాబాద్ నగరపాలక సంస్థ 20262027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన బడ్జెట్ ఆమోదం పొందింది. శనివారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో మేయర్ కూరగాయల ఉమారాణి అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శాసన మండలి సభ్యులు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. 20262027 సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదిత బడ్జెట్ తో పాటు, 2025 2026 సవరించిన అంచనా బడ్జెట్ ను సమావేశంలో ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. 2025 ఏప్రిల్ 01 నాటికి ప్రారంభ నిల్వ రూ. 9471.33 లక్షలు, 2025 2026 సవరణ అంచనా ఆదాయం రూ. 13717.11 లక్షలు కలుపుకుని మొత్తం రూ. 23188.44 లక్షలుగా పేర్కొన్నారు. 20262027 సంవత్సరపు సాధారణ నిధుల అంచనా ఆదాయం రూ. 14763.60 లక్షలుగా బడ్జెట్ లో పొందుపర్చారు. ప్లాన్ అండ్ నాన్ ప్లాన్ గ్రాంట్ల ద్వారా రూ. 9937.00 లక్షల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. అదేవిధంగా మొత్తం అంచనా వ్యయం రూ. 24700.60 లక్షలుగా బడ్జెట్ పద్దులో పేర్కొన్నారు. ప్రతిపాదిత బడ్జెట్ వివరాలను సమావేశంలో చదివి వినిపించగా, సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా తమతమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి సానుకూలంగా స్పందించారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం అని, నిజామాబాద్ నగర అభివృద్ధే ధ్యేయంగా అందరం పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ సూచించారు. నిజామాబాద్ నగరానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరగా, సానుకూలంగా స్పందించారని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులో అన్ని డివిజన్లకు సమ ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా నిజామాబాద్ లో మాస్టర్ ప్లాన్ అమలు అనివార్యంగా మారిందని అన్నారు. ఇప్పటికే ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరిగిందని, ఎవరికీ ఎలాంటి అన్యాయం జరుగకుండా ఉండేందుకు ముసాయిదా ప్లాన్ లో ఏవైనా సవరణలు చేయాల్సి ఉంటే వాటిని చేపట్టేందుకు వీలుగా కార్పొరేటర్లతో కూడా భేటీ నిర్వహించాలని సూచించారు. కాగా, ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం వాటిల్లకుండా, వారికి జవాబుదారీగా వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. కార్పొరేటర్లు ప్రస్తావించే ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేయాలన్నారు. ఆయా డివిజన్లలో నెలకొని ఉన్న సమస్యలపై చర్చించి, పరిష్కారం చూపేందుకు వీలుగా నెల రోజుల లోపే మేయర్ అనుమతితో నగర పాలక సంస్థ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. కార్పొరేషన్ కు ఆదాయ వనరులను పెంపొందించుకునేందుకు వీలుగా ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా పారదర్శకంగా పరిష్కరిస్తూ అర్హత కలిగిన వారికి అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. సానిటేషన్ పనులు పక్కాగా పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా వాట్స్ యాప్ గ్రూప్ లను ఏర్పాటు చేసుకుని, సిబ్బంది పనితీరును నిశితంగా పరిశీలించాలని కమిషనర్ కు సూచించారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది హాజరును ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 28: హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియ భూభారతి మరియు మీ సేవా దరఖాస్తుల పురోగతిపై ఆర్డీవోలు, తహసీల్దార్లు మరియు ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల కోసం ఇప్పటివరకు చేపట్టిన భూసేకరణ ఇంకా చేపట్టాల్సిన భూసేకరణ పరిహారం చెల్లింపు భూభారతి దరఖాస్తుల పరిష్కారం,మీ సేవా పెండింగ్ దరఖాస్తుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమగ్రంగా చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి వచ్చే శనివారం నాటికి పురోగతి వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు సాగునీటి కాల్వల కోసం అవసరమైన భూసేకరణలో భాగంగా పెగ్ మార్కింగ్ పనులను సోమవారం నుంచి ప్రారంభించాలని సూచించారు. నగర పరిధిలో మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ఏర్పాటు కోసం అవసరమైన భూములను గుర్తించి సేకరించాలని తెలిపారు. భూసేకరణకు సంబంధించిన ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి వివరాలతో నివేదికను వచ్చే శనివారం నాటికి సమర్పించాలని ఆదేశించారు గతంలో ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలను భూభారతిలో నమోదు చేయాలని సూచించారు. ఆర్వోఆర్ మరియు సీనియర్ సిటిజన్ కేసులను ప్రతి వారం పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హనుమకొండ పరకాల ఆర్డీవోలకు ఆదేశించారు భూభారతి సాదాబైనామా ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని పేర్కొన్నారు మీ సేవ ద్వారా వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, డీఆర్వో సత్యపాల్ రెడ్డి, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, భూముల కొలతల శాఖ ఏడీ జాదవ్ నూర్ సింగ్, సాగునీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారామ్, ఈఈ మంగీలాల్, డీఈ చైతన్య, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 3,758 కేసుల పరిష్కారం

- కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం

లజాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో మొత్తం 3,758 కేసులు పరిష్కరించబడినట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.ఈ పరిష్కరించిన కేసుల్లో పెట్టి కేసులు, ట్రాఫిక్ సంబంధిత కేసులు, ఎక్సైజ్‌కు సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఇతర చట్టపరమైన స్వల్ప కేసులు ఉన్నాయి. లోక్ అదాలత్ ద్వారా పాత పెండింగ్ కేసులకు వేగవంతంగా పరిష్కారం లభించడంతో పాటు, ప్రజలకు కోర్టు వ్యవహారాల్లో సమయం, ఖర్చు తగ్గిందని తెలిపారు.కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కారంలో మంచి ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేసుల పరిష్కారానికి సహకరించారని తెలిపారు.ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావడానికి సహకరించిన న్యాయాధికారులు, పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు ప్రజలకు కమిషనరేట్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

మంచిర్యాల కార్పొరేషన్ బడ్జెట్‌కు ఆమోదం

ప్రతిపక్షం, మంచిర్యాల ప్రతినిధి, మార్చి 28: రాష్ట్రంలో మంచిర్యాల కార్పొరేషన్ అభివృద్ధిలో ఏ వన్ కార్పొరేషన్ గా గుర్తింపు పొందేందుకు అందరికీ ఆమోదకరమైన అంచనా బడ్జెట్ను కేటాయించడం జరిగిందని మంచిర్యాల కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్ స్పష్టం చేశారు. శనివారం కార్పొరేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్పొరేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల కార్పొరేషన్ వ్యయమును ప్రతి అంశమును చదివి సభ్యులకు వినిపించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ కలెక్టర్ చంద్రయ్య పాల్గొన్నారు. కార్పొరేషన్ బడ్జెట్ విషయములో మేయర్ కేవలం బడ్జెట్ కేటాయింపు విషయం మాత్రమే మాట్లాడాలని సూచించడం జరిగింది. అయినప్పటికీ సభ్యులు మధ్య మధ్యలో ప్రశ్నలు స్పందించారు. పదేపదే మేయర్ బడ్జెట్ కేటాయింపు విషయం మాట్లాడాలని సూచించడంతో సమావేశం రసాభాసగా మారింది. ఏడాది బడ్జెట్ 74 కోట్ల 76 లక్షల 14000 అంచనా బడ్జెట్ గా అందరికీ ఆమోదకరంగా ఉన్నదని మేయర్ పేర్కొన్నారు. 60 మంది కార్పొరేటర్లు హాజరు కాగా మెజార్టీ కార్పొరేటర్లు బడ్జెట్ను ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందని ప్రకటించారు. ఒక్కొక్కరు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు తమ అభిప్రాయాన్ని తెలియజేస్తూ ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ గత ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు ఆమోదకకరంగా ఉన్నదని తెలిపారు. కాగా టిఆర్ఎస్ బిజెపి కార్పొరేటర్లు ఐదుగురు బడ్జెట్ కేటాయింపు ఆమోదయోగ్యంగా లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము మాట్లాడేందుకు మైకు ఇవ్వకపోగా తమ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. ప్రజల అభివృద్ధి కోసం కేటాయించిన బడ్జెట్ను ప్రజల కోసం ఉపయోగించి సౌకర్యాలు కల్పించాలని డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారు. చట్ట పరిధిలో ప్రతి పౌరునికి అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా సభ్యుల కృషి చేయాలి అన్నారు. కొత్తగా ఎంపికైన కార్పొరేటర్లు ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా విష్ చేయాలని సూచించారు. కార్పొరేషన్కు వివిధ టాక్సుల రూపాలలో వచ్చిన నిధులను ప్రజల సౌకర్యాలకు కేటాయించి కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల రమ్య కార్పొరేటర్ తదితరులు పాల్గొన్నారు.

విపక్షాల నిరసన

మంచిర్యాల కార్పొరేట్ సమావేశంలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులపై బిజెపి కార్పొరేటర్ గాజుల ముఖేష్‌గౌడ్, టిఆర్ఎస్ కార్పొరేటర్లు ఎండి సత్తార్ ఖాన్ లతోపాటు ఐదుగురు కార్పొరేటర్లు సమావేశం ముందు నిరసన వ్యక్తం చేశారు. తమ అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఆవేదం వ్యక్తం చేశారు, మంచిర్యాలలో అనేక సమస్యలు ఉన్నాయని, డంపింగ్ యార్డ్ లేదని మంచిర్యాల కార్పొరేషన్ తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికే కోట్ల నిధులు తప్పుగా ఉందని అన్నారు.

రాజధానిపై అసెంబ్లీ చేసిన తీర్మానం ఈ రోజే కేంద్రానికి వెళ్తుంది. ఏప్రిల్ 1న కేంద్ర కేబినెట్ దీనికి ఆమోదం తెలుపుతుంది. 2న పార్లమెంటులో ప్రవేశపెడతారు. అసెంబ్లీకి గైర్హాజరైన వైసీపీ పార్లమెంటులో ఏం చేస్తుందో చూడాలి. జగన్ సినిమా ఏంటో గత ఎన్నికల్లో తేలిపోయింది. ఇంకేం సినిమా చూపిస్తారు.

- ఏపీ మంత్రి నారా లోకేశ్

ప్రాంతీయం

అందని నీరు.. ఎండుతున్న పైరు

- తలాపున గోదావరి గలగలలు.. అయినా రైతులకు తప్పని తిప్పలు
- ట్యాంకర్లతో వరి పైరుకు సాగునీరు పోస్తున్న రైతులు

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 28: తలాపున గోదావరి జలాలు పారుతున్నాయి. అయినా పంటలు ఎండి పోతున్నాయి. పొలాల్లో పారాల్సిన జలాలు పంట కాలువలు తవ్వక పోవడంతో వృథాగా ఉన్న భూముల్లో పారుతున్నాయి. అడుగంటిన భూగర్భ జలాలతో వ్యవసాయ బావులు, బోరు బావులు ఎండిపోయాయి. దీంతో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు ట్యాంకర్లతో వరి పొలాలకు సాగునీరు అందిస్తున్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో రైతుల ఆవేదన రోజురోజుకూ పెరుగుతోంది. ఎండలు తీవ్రరూపం దాల్చడంతో పంటలకు అవసరమైన సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట చివరి దశలో నీరు అత్యవసరం కాగా, సాగు నీటి కొరత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే చెక్‌డ్యాంలు పూర్తిగా అడుగంటి పోయాయి. బావులు, బోర్లలో నీటి మట్టం గణనీయంగా పడిపోయింది. రైతులు వంతుల వారీగా నీటిని పొలాలకు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమయానికి తడులు అందించడం కష్టంగా మారింది. ఒక వైపు పచ్చగా వరి గొలుసులతో పొలాలు కనిపిస్తుండగా, మరోవైపు నీరు అందక ఎండిపోతున్న పైరు రైతులను కలవరపెడుతోంది. బద్దిపడగ గ్రామానికి చెందిన రైతు తప్పెట పరశు రాములు తనకున్న ఎకరం రెండు గుంటల భూమిలో అర ఎకరంలో వరి సాగు చేశాడు. చేతికొచ్చిన పంట నీరు లేక ఎండి పోతుండటంతో తీవ్రంగా కలత చెందుతున్నాడు. ట్రాక్టర్ సహాయంతో వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పంటను కాపాడేందుకు శ్రమిస్తున్నాడు. పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. చేతికొచ్చిన పంటను నిలబెట్టుకోవడానికి తీవ్రంగా కష్టపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. కాళేశ్వరం కాల్వ ద్వారా పంట పొలాలకు సాగు నీటిని అందించేందుకు భూ సేకరణ చేపట్టారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులకు నష్టపరిహారం చెల్లించి భూసేకరణ పూర్తి చేశారు. అనంతరం కాల్వ తవ్వకం పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో పొలాలకు పారాల్సిన నీరు వృధాగా ఉన్న సెల్క భూముల్లో పారుతోంది. ప్రస్తుతం యాసంగి పంటల సమయంలో బోరుబావులు ఎండిపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. చేతికొచ్చిన పంటను కాపాడుకోవడానికి ట్రాక్టర్ల ద్వారా నీటిని తరలిస్తూ అత్యవసర చర్యలు చేపడుతున్నారు. తలాపున కాళేశ్వరం జలాలు పారుతున్నా రైతులకు మాత్రం నీటి కొరత తీరక పోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి కాల్వ నిర్మాణాలను పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతులు వేడుకుంటున్నారు. లేకపోతే భారీ పంట నష్టం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డ్రగ్స్, గంజాయి దరిచేరనీయ కుండా
యువజన సంఘాలు ఆదర్శంగా నిలవాలి

- గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతి గౌడ్

ప్రతిపక్షం,గజ్వేల్, మార్చి 28: డ్రగ్స్, గంజాయిని యువత దరిచేరనీయవద్దని గజ్వేల్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతి గౌడ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ రన్నర్స్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 12 న ఉదయం చేపట్టనున్న ప్రోమో రన్ పోస్టర్ ను వారు కోర్టులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోజూ వారీ జీవితంలో వ్యాయామం, యోగా, క్రీడలపై ఆసక్తి పెంచుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రస్తుత యువత గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. గజ్వేల్ రన్నర్స్ చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గజ్వేల్ రూరల్ సీఐ రవిరాజు, తొగుట సీఐ ఎస్కే లతీఫ్, ఎస్ఐలు అరుణ్, మహిపాల్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రఘుపతి, మానస, కృష్ణారెడ్డి, కోర్టు సూపరింటెండెంట్లు జ్యోతినాథ్ రెడ్డి, హనుమంతరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ సాగర్ రావు, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, న్యాయవాదులు పార్థసారధి రాజు, హరికృష్ణ పోస్టర్లను ఆవిష్కరించారు. వారితో ఈ కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు జనార్ధన్, నిఖిల్ రెడ్డి, జంగం రమేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, కరుణాకర్, సత్యం, ఆంజనేయులు, నరేష్ గౌడ్, ముస్తఫా, అష్రఫ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా రథోత్సవం.. ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 28: మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామచంద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు భక్తి, భరితంగా అంగరంగ వైభవంగా కొనసాగాయి. చివరి రోజు శనివారం ఉదయం ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, నరసింహాచార్యులు, వెంకట్ చార్యులు, వైద్య శ్రీనివాస్ శర్మ, శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకం వైభవంగా నిర్వహించారు. 108 కలశాల జలంతో వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అలంకరించిన ఘటాలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. మంగళ వాయిద్యాలు, వేదఘోషల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి దివ్య రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారిని ఊరేగించగా, వేళా తాళాలు, తీన్మార్ డప్పులు, బాణాసంచా వెలుగులు ఉత్సవానికి మరింత శోభను చేకూర్చాయి. రథాన్ని లాగేందుకు భక్తులు, యువకులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎం. దేవేందర్ రెడ్డి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాదాశీర్వచనం, పండితుల సన్మానంతో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తైబజార్,షెటర్లు వేలం

ప్రతిపక్షం, చేర్యాల, మార్చి 28: చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో తైబజార్,షెటర్లు వేలంపాట ఎంపిఓ ఆధ్వర్యంలో శనివారం గ్రామ సర్పంచ్ కొమ్ము రవి,పాలకవర్గం అధ్యక్షతన, గ్రామ కార్యదర్శి కరిమొద్దీన్ సమక్షంలో గ్రామపంచాయతీ తైబజార్ ఆకునూరు గ్రామానికి చెందిన అందె నానిబాబు 54,500 రూపాయలకు కైవసం చేసుకున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని గత 20 సంవత్సరాల నుండి ఏ సర్పంచి వేయని 7 శెట్టర్లు ప్రస్తుత గ్రామ సర్పంచ్ వేలం పాట వేసిన ఘనత దక్కించుకున్నారు. 7 సెటర్లకు 3,70500 రావడం జరిగింది. సిద్దిపేట జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీకి వేలం పాట ద్వారా మొత్తం 4,25000 రూపాయలు రావడం జరిగింది. గ్రామ సర్పంచికి ఈ సందర్భంగా ప్రజలు మద్దతు పలికారు. ఈ వేలం పాటలో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పారిశుధ్యం, త్రాగునీరు సరఫరా సక్రమంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 28: పట్టణ పౌరులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని మున్సిపాలిటీలలో పారిశుధ్య, కార్యక్రమాలు, త్రాగునీరు సరఫరా సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ అబ్దుల్ హమీద్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ వేసవి కాలంలో త్రాగునీరు సరఫరాలో ఇబ్బంది కలగకుండా అని మున్సిపాలిటీలలో ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, పట్టణాలు అపరిశుభ్రంగా ఉంటే ప్రజల ఆరోగ్యం బాగుండదని కచ్చితంగా ప్రతి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. పట్టణానికి ఆదాయాన్ని సమకూర్చే పన్నులను కూడా సకాలంలో వసూలు చేయాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రభుత్వం సూచించిన విధంగా కచ్చితంగా అమలు చేసి ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేసి పట్టణాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ మరియు చేర్యాల మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ ధర్నాను జయప్రదం చేయండి

ప్రతిపక్షం,సిద్దిపేట టౌన్,మార్చి 28: హలో మాదిగ చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని సిద్దిపేట లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 30న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో జరిగే ధర్నాకు హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు, నిరుపేదలకు 12 లక్షల నిధులు, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, పారిశుధ్య కార్మికుల రెగ్యులరైజేషన్ వంటి డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ బోడా ప్రశాంత్ మాదిగ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా దళిత రత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధిని రాజ మల్లయ్య మాదిగ, రాష్ట్ర సహాయ కార్యదర్శి బొంబాయి వెంకన్న మాదిగ, జిల్లా అధ్యక్షుడు లింగాల కృష్ణ మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు జంగాపల్లి సాయిలు మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలి గారి కృష్ణ మాదిగ పాల్గొన్నారు.

ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట మార్చి 28: సిద్దిపేట జిల్లా దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన ₹6000 పెన్షన్, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన సమయంలో ఇతర విషయాలకు ప్రాధాన్యం ఇవ్వడం సిగ్గుచేటని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా సంబంధిత మంత్రులు స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, తమ హక్కులను గౌరవించాలని డిమాండ్ చేస్తూ "చలో హైదరాబాద్ - చలో అసెంబ్లీ ముట్టడి" కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ సహా పలువురు పాల్గొన్నారు.

108 కలశాలతో శ్రీ సీతారాముల అభిషేకాలు

- మెదక్ శ్రీ కోదండ రామాలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చి 28: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగంపేట్ పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి ఆలయాన్ని సందర్శించి శ్రీ సీతారామచంద్ర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సమక్షంలో అర్చకులు 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమం భక్తులను ఆధ్యాత్మికంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వామి భక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ప్రతి ఒక్కరూ శ్రీ రాముని గుణగణాలను అలవర్చుకొని ధర్మ మార్గంలో నడుస్తూ జీవితంలో ముందుకు సాగాలని హితబోధ చేశారు. అభిషేకాల అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి మహామంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యాదవులు ప్రతి రంగంలో ఎదగడం అభినందనీయం

- పోచబోయిన శ్రీహరి యాదవ్

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట, మార్చి 28 : యాదవులు అన్ని రంగాలలో ఎదగడం అభినందనీయమని అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిన పోచబోయిన శ్రీహరి యాదవ్ అన్నారు. సిద్దిపేటలోని శ్రీకృష్ణ యాదవ సంఘం వేడుక మందిరంలో అఖిల భారత యాదవ మహాసభ లీగల్ సెల్ అధ్యక్షుడు చింతల మల్లేశం యాదవ్ అధ్యక్షతన ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన యాదవ న్యాయవాదులకు శనివారం అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అఖిలభారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరెల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోచబోయిన శ్రీహరి యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీహరి యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఇటీవలి కాలంలో విద్యా ఉద్యోగ రంగాలతో పాటు రాజకీయాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ చైతన్యవంతమైన పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ, మునిసిపల్ ఎన్నికలలో యాదవులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యారని చెప్పారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో చలకాని వెంకట్ యాదవ్, గోకుల్ రామారావు యాదవ్, బార్ కౌన్సిల్ మెంబర్లు ఎన్నిక అయ్యారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక బారాసోసియేషన్ లలో అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా, కార్యవర్గ సభ్యులుగా, వివిధ హోదాలలో యాదవులు గణనీయమైన సంఖ్యలో ఎన్నిక కావడం ఆహ్వానించదగ్గ శుభ పరిణామం అన్నారు. అన్ని రంగాల్లో యాదవులు ముందుకు సాగడానికి ఈ విజయాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ లో నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి వర్దోలు సదానందం యాదవ్, లైబ్రరీ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన మామిండ్ల రాము యాదవ్, కార్యవర్గ సభ్యునిగా ఎన్నికైన చెవుల రాములు యాదవ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా వారికి మెమొంటో అందజేసి పూలమాలవేసి శాలువాతో సత్కరించారు. వృత్తిలో రాణిస్తూనే జాతి అభివృద్ధి సంక్షేమం కోసం కూడా పాటుపడాలని సంఘ కార్యక్రమాల్లో కూడా విస్తృతంగా పాల్గొనాలని వారిని కోరారు. సన్మాన గ్రహీతలు వర్దోలు సదానందం, మామిళ్ళ రాము, చెవుల రాములు మాట్లాడుతూ తమను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ వృత్తి కోసం అంకితభావంతో పనిచేస్తున్నట్టుగానే యాదవ జాతి అభివృద్ధి సంక్షేమం కోసం అంతే అంకితభావంతో కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ ఐలయ్య యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్, యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు గొట్టె మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి ఉండ్రాళ్ళ రాజేశం యాదవ్, ఎంప్లాయిస్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ అధ్యక్షుడు పయ్యావుల రాములు యాదవ్, యాదవ ఎంప్లాయి సొసైటీ ప్రధాన కార్యదర్శి సందబోయిన రాజు యాదవ్, తలారి చంద్రశేఖర్ యాదవ్ అఖిలభారత యాదవ మహాసభ యువజన విభాగం సిద్దిపేట పట్టణ శాఖ అధ్యక్షుడు బొల్లవేణి మహేష్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ ఫంక్షన్ హాల్ కార్యదర్శి కుక్కల తిరుపతి యాదవ్ పాల్గొన్నారు.

డంప్ యార్డులో అదుపులోకి మంటలు!

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్ ,మార్చి 28 : మెదక్ జిల్లా కేంద్రంలో దట్టమైన పొగ వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పొగ మెదక్ పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందిని కలిగించింది. మెదక్ జిల్లా కేంద్రంలోని డంప్ యార్డులో ఒక్కసారిగా మంటలు అద్దుకున్నాయి. దీంతో పట్టణ ప్రజలు తీరా ఇబ్బందులకు గురయ్యారు పట్టణ శివారులోని మున్సిపాల్ డంపు యార్డులో మంటలను అదుపు చేసేందుకు ఫైర్ ఇంజిన్ల సహాయంతో అదుపు చేస్తున్నారు. మున్సిపల్ ఛైర్పర్సన్ కానుగు రాధికా భూపతిరాజు, కౌన్సిలర్లతో కలిసి పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించారు. నిన్నటి నుండి పొగ వ్యాపించి ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో, ఫైర్ ఆఫీసర్ వేణుతో మాట్లాడి మంటలను పూర్తిగా ఆర్పివేయాలని అధికారులను ఆదేశించారు.



బహ్రెయిన్, కువైట్, ఖతర్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాలపై మేము దాడులు ఆపాలంటే ఆ రెండు దేశాలకు అనుమతి ఇవ్వొద్దు. ఏ దేశంపైనా మేము ముందస్తు దాడులు చేయబోం. తమ అణు, ఆర్థిక కేంద్రాలను లక్ష్యం చేసుకుంటే ఊరుకోబోం. శత్రువులకు సహకరించిన వారినీ వదలబోం.

- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్

ప్రాంతీయం

కలెక్టర్ చేతుల మీదుగా ఇద్దరు చిన్నారుల దత్తత

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 28: సిద్దిపేట జిల్లాలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఇద్దరు చిన్నారులను దత్తతగా అప్పగించారు. జిల్లా కలెక్టర్ కే. హైమావతి చేతుల మీదుగా ఈ దత్తత ప్రక్రియ అధికారికంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా 4 సంవత్సరాల బాలుడిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం జిల్లాకు చెందిన దంపతులకు, అలాగే 6 నెలల ఆడ శిశువును నిజామాబాద్ జిల్లాకు చెందిన దంపతులకు దత్తతగా ఇచ్చారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దత్తత తీసుకున్న తల్లిదండ్రులు పిల్లలను మంచి విద్యతో పాటు వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు బంగారంగా తీర్చిదిద్దే బాధ్యత పూర్తిగా తల్లి దండ్రులదేనని పేర్కొన్నారు. పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలోని శిశు గృహం లేదా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ఎలాంటి న్యాయపరమైన సమస్యలు ఎదురుకావని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము మరియు శిశు గృహ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 28: సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలతో సిద్దిపేట జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని సిద్ది పేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి తెలిపారు. లోక్ అదాలత్ లో ఎక్కువగా చెక్ బౌన్స్ కేసులు, మనీ రికవరీ కేసులు, యాక్సిడెంట్ కేసులు పరిష్కరించడం జరుగుతుందని న్యాయమూర్తి తెలిపారు. సిద్దిపేట జిల్లా కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ ను ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 2340 కేసులు రాజీమార్గం ధ్వారా పలు కేసులను పరిష్కారం చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. అనంతరం 2026 సంవత్సరానికి గాను ఈరోజు మొదటి లోక్ అదాలత్ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో పెండింగ్లో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జరిమానాను 50 శాతం వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. రాజీమార్గమే రాజమార్గమని లోక్ అదాలత్ లో కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటుచేసి ఆమోదయోగమైన అన్ని కేసులు రాజీ ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు. రాజీ ద్వారా కోర్టు కేసులు పరిష్కరించుకుంటే కోర్టు ఫీజులు తిరిగి పొందవచ్చునని అలాగే సమయం కూడా ఆదా అవుతుందని ఈ అవకాశాన్ని కక్షిదారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలి!

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

ప్రతిపక్షం, తొగుట, మార్చ్ 28: మానవ సేవయే మాధవ సేవ అన్నట్లు కష్ట కాలంలో ఉన్నవారికి అండగా నిలిస్తే దైవం భలం కూడా తోడుంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెంకట్రావుపేట కు చెందిన ఈదుగాళ్ల స్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కుడి చేతిని కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సందర్భంలో వారి కుటుంబానికి బి ర్ స్ సీనియర్ నాయకులు పిట్ల వెంకట్,పాత్కూల బాలేష్,ఉప సర్పంచ్ లచోళ్ల లింగం, బి ఆర్ ఎస్ యువకులు పాత్కూల ఆంజనేయులు,రాము,చంద్రం,పంది గణేష్,కందిరాజు,అనిల్,రేపాక బాల్ చంద్రం,చాట్లపల్లి నవీన్ ,లు రూ: 10వేలు ఆర్థిక సహాయం అందజేశారు..మనిషి మనిషికి తోడుగా నిలవాల్సిన అవసరం ఉందని,ఇలాంటి కష్టకాలంలో సహాయం చేయడం మన సమాజం బాధ్యత అని పేర్కొంటూ, మరింత మంది ముందుకు వచ్చి బాధిత కుటుంబానికి చేయూతనివ్వాలని ఆయన కోరారు.. కార్యక్రమం లో గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పులిగారి శివయ్య, నాయకులు బండారు స్వామి గౌడ్, పులిగారి నర్సింలు,నరేష్,నాగరాజు, నాగయ్య,ఈదుగాళ్ల పర్శరాములు, వార్డ్ మెంబర్ జహంగీర్ తదితరులు ఉన్నారు..

ప్రమాదాలు విధి కాదు.. అవి నిర్లక్ష్య ఫలితమే!

- డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణం
- చూపు సమస్యల గుర్తింపుతో ప్రమాదాల నివారణపై దృష్టి
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ప్రతిపక్షం,మెదక్ టౌన్, మార్చి 28: "ప్రమాదాలు విధి కాదని, అవి నిర్లక్ష్య ఫలితమే" అని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలనే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం శనివారం మెదక్ పట్టణంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ భద్రత పై అవగాహన పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆటో, బస్సు, లారీ డ్రైవర్లు మరియు పోలీస్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి,అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ వినియోగం కారణమని ఆయన తెలిపారు. ముఖ్యంగా రాత్రివేళల్లో చూపు సమస్యల వల్ల ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనదారులు, పిలియన్ రైడర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపవద్దని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రంగనాథ్, సీఐలు జార్జ్, మహేష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం.. విద్యార్థులకు శాపం

- విద్యార్థులకు స్పిలురియా ఫుడ్ సప్లిమెంట్ మాత్రల పంపిణీ
- నర్మెట ప్రాథమిక పాఠశాలలో సున్యాటి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 28: పోషకాహార లోపం వల్ల విద్యార్థులలో శారీరక ఎదుగుదల మందగించి ఏకాగ్రత తగ్గుతుందని సున్యాటి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ సమన్వయకర్తలు మామిడాల నాగరాజు, గడ్డం మహేందర్ అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట ప్రాథమిక పాఠశాలలో పోషకాహార లోపంతో వయసుకు తగ్గ ఎత్తు, బరువు లేని విద్యార్థులకు సముద్ర గర్భంలోని నాచుతో తయారైన స్పిలురియా ఫుడ్ సప్లమెంట్ మాత్రలను డీఎక్స్ఎన్ కంపెనీ సౌజన్యంతో సున్యాటి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సున్యాటి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ సమన్వయకర్తలు మామిడాల నాగరాజు గడ్డం మహేందర్ మాట్లాడుతూ పోషకాహార లోపం ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు శాపంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోషకాహార లోపంతో బాధపడే విద్యార్థులు తరచుగా అనారోగ్యానికి గురై చదువులో వెనుకబడుతారని చెప్పారు. జ్ఞాపకశక్తి తగ్గుతుందన్నారు. ఇది విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపారు. పోషకాహార లోపంతో వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోవడం, కండరాల అభివృద్ధి మందగిస్తాయన్నారు. దీని వల్ల ప్రగతి గదిలో పాఠాలపై శ్రద్ధ పెట్టలేదని చెప్పారు. నేర్చుకున్నవి మర్చిపోవడం వంటి సమస్యలు వస్తాయన్నారు. ఐరన్, విటమిన్లు, ప్రోటీన్ లోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి, తరచుగా ఇన్ఫెక్షన్లు, జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యల నుండి బయటపడటానికి విద్యార్థులకు విటమిన్లు, ప్రోటీన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉండే సమతుల్య ఆహారం అందించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల బరువు, ఎత్తులను సేకరించి 70 మంది విద్యార్థులకు స్పిలురియా ఫుడ్ సప్లమెంట్ మాత్రలను రెండు సీసాల చొప్పున(240 మాత్రలను) అందించారు. పాఠశాలలో ఏ ఒక్క విద్యార్థి కూడా సరియైన బరువు ఎత్తు ప్రమాణాలలో లేకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. వన్ డాలర్ వన్ చైల్డ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు స్పిలురియా ఫుడ్ సప్లిమెంట్ మాత్రలను విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు ఎనగందుల మనీష్ కుమార్ మాట్లాడుతూ పోషకాహార లోపాలతో బాధపడుతున్న విద్యార్థులకు స్పిలురియా ఫుడ్ సప్లమెంట్ మాత్రలను అందించడం ద్వారా సమాజ సేవ చేయడం అభినందనీయమన్నారు. ఖరీదైన మాత్రలను ఉచితంగా పాఠశాల విద్యార్థులకు అందించినందుకు సంస్థ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.

యాసంగి వరి ధాన్యం కొనుగోలు పటిష్టంగా చేపట్టాలి

- చివరి గింజ వరకు రైతుల ధాన్యం కొనుగోలు
- నాణ్యత ప్రమాణాలు తప్పనిసరి దళారులను ఆశ్రయించవద్దు
- కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 28: యాసంగి వరి ధాన్యం కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సివిల్ సప్లై,వ్యవసాయ, పోలీస్, గ్రామీణ అభివృద్ధి, రెవెన్యూ, రవాణా శాఖల అధికారులు, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు తమ ధాన్యం విక్రయంలో దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 చెల్లిస్తామని తెలిపారు.ఏప్రిల్ 1 నుంచి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పెద్ద ఎత్తున ప్రారంభించాలని ఆదేశించారు. యాసంగి సీజన్‌కు మొత్తం 4,45,466 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఇందుకోసం జిల్లాలో 413 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో ఐకెపి 154, పిఎసిఎస్ 224, డీసీఎంఎస్ 9, ఎఫ్‌పీఓ 26 కేంద్రాలు ఉన్నాయి.రైతుల వద్ద ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. కొనుగోలు ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. వడగండ్లు, అకాల వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండి టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ధాన్యం తేమశాతం సరిగా నమోదు చేసి ట్యాబ్ ఎంట్రీ చేయాలని, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీఓ రమాదేవి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, రవాణా అధికారి శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



నేడు రామకోటికి జాతీయ ఉగాది పురస్కారం

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 28: గత 30 సంవత్సరాల నుండి లక్షల మంది భక్తులచే రామ నామమే ప్రాణమని 'రామ' నామాన్ని లిఖింపిజేపిస్తూ, 4 సంవత్సరాల నుండి భద్రాచలం సీతారాముల కళ్యానానికి తెలంగాణ రాష్ట్రం నుండి గోటి తలంబ్రాలు అందించి భద్రాచల భక్త రామదాసుగా సన్మానించపడ్డ గజ్వేల్ రామకోటి రామరాజుకు ఈనెల 29న కరీంనగర్ లో జాతీయ ఉగాది పురస్కారం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఒక్క కెమెరా వంద మంది పోలీసులకు సమానం

- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు
- మెదక్ పట్టణంలో 60 కెమెరాల ఏర్పాటు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 28 : నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాల పాత్ర అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని ఆయన అన్నారు.మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ చైర్మన్, మాజీ చైర్మన్, కౌన్సిలర్ల సహకారంతో 60 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల ప్రారంభోత్సవాన్ని జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. దొంగతనాలు, చోరీలు జరిగితే సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను సులభంగా గుర్తించి పట్టుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే అనేక కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడినట్లు వెల్లడించారు.జిల్లాలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా సీసీ కెమెరాల ఏర్పాటు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజల సహకారంతో మరింత భద్రత కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి కాలనీ, గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నేరాలపై నియంత్రణ సాధ్యమవుతుందని సూచించారు. దాతలకు జిల్లా ఎస్పీ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ సీఐ మహేష్, ప్రజాప్రతినిధులు, దాతలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంచలనం సృష్టించిన వృద్ధులపై దాడి కేసు

- 48 గంటల్లోనే నిందితుడు అరెస్ట్
- 4½ తులాల బంగారం రికవరీ, వాహనం స్వాధీనం
- జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి28 : మెదక్ జిల్లాలో సంచలనం సృష్టించిన వృద్ధ దంపతులపై దాడి బంగారం దోచుకెళ్లిన కేసును మెదక్ పోలీసులు 48 గంటల్లో ఛేదించి వృద్ధులను దాడి చేసిన వారిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. శంకరంపేటఆర్ మండలంలోని జంగరాయి గ్రామంలో వృద్ధ దంపతులపై పట్టపగలు దాడి చేసి దోపిడీకి పాల్పడిన సంచలన కేసును పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి సుమారు 4½ తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జంగరాయి గ్రామానికి చెందిన తమ్మల నర్సింలు (48) ఫిర్యాదు మేరకు ఈ నెల 25న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ముఖానికి ముసుగు ధరించి వారి ఇంట్లోకి చొరబడ్డాడు. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులు తమ్మల అంజయ్య (85), సావిత్రమ్మ (80)పై ఇనుప రాడ్డుతో దాడి చేసి, వారి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకెళ్లాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో నిందితుడిని గుర్తించారు. శనివారం (28న) ఉదయం 9 గంటలకు తూప్రాన్ బస్ స్టాప్ వద్ద వరిగే వెంకట నారాయణ (40)ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడు నాగిరెడ్డిపేట మండలం, కామారెడ్డి జిల్లా వాసి కాగా, ప్రస్తుతం తూప్రాన్‌లో నివాసం ఉంటున్నాడు.నిందితుడి వద్ద నుంచి 2½ తులాల బంగారు పుస్తెల తాడు, 1½ తులాల గొలుసు, అర్ధ తులం బంగారు ఉంగరం, అలాగే నేరానికి వినియోగించిన TVS XL వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం సుమారు 4½ తులాల బంగారం రికవరీ చేసినట్లు పోలీసులు తెలిపారు.దర్యాప్తులో నిందితుడు అప్పులు తీర్చుకోవడం కోసం సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు వెల్లడైంది. బాధితులు తనకు పరిచయం ఉన్న బంధువులేనని తెలిసినా, ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించి పథకం ప్రకారం నేరానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచనలతో రామాయంపేట సీఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు కృషి చేసి కేసును ఛేదించాయి. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఇలాంటి ఘటనల నేపథ్యంలో ప్రజలు అపరిచితులపై నమ్మకం ఉంచకుండా అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

ఇరాన్ అగ్ర నాయకులందరినీ హతమార్చాం. నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కూడా మరణించడం లేదా తీవ్రంగా గాయపడి ఉంటారు. ఇటీవల కాలంలో ఆయన బహిరంగంగా కనిపించలేదు. ప్రకటనలూ వెలువడలేదు. ఇరాన్ మిలిటరీ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. ఇవి తప్ప మిగతా విషయాల్లో వారు బాగానే ఉన్నారని భావిస్తున్నా.

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్

విశ్వ వీక్షణం

యుద్ధ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 28: పశ్చిమాసియాలో యుద్ధం విసురుతున్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం నొయిడా లో అంతర్జాతీయ విమానాశ్రయం తొలి దశను ప్రధాని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని ప్రధాని అన్నారు. అక్కడ నెల రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోందని చెప్పారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందని తెలిపారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ సంక్షోభం నుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంలో ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయవద్దని ప్రత్యర్థి రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు దేశ ప్రయోజనాలకు, దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయని ప్రధాని చెప్పారు. కాగా నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంటుంది. సరకు రవాణా కోసం కార్గోలాజిస్టిక్ జోన్‌లను అనుసంధానిస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌ను కూడా నిర్మించారు.

అయోధ్య యజ్ఞశాలలో భారీ అగ్నిప్రమాదం

- కాలిబూడిదైన వెదురు మండపం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 28: అయోధ్య లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా ఏర్పాటు చేసిన మహా యజ్ఞశాలలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సరయూ నది తీరంలోని జమ్తారా ఘాట్ వద్ద నిర్వహించిన శ్రీ లక్ష్మీనారాయణ మహాయజ్ఞంలో ఈ అగ్నిప్రమాదం సంభవించింది. యజ్ఞం ముగిసిన మరుసటి రోజే ఈ ప్రమాదం జరగడం గమనార్హం. యజ్ఞశాలలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఒక ఎకరం విస్తీర్ణంలో వెదురు, గడ్డితో నిర్మించిన మండపం క్షణాల్లో కాలి బూడిదయింది. కాగా ప్రమాద సమయంలో యూపీ రవాణా మంత్రి దయాశంకర్ సింగ్, పలువురు ఉన్నతాధికారులు అక్కడే ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఆరు అగ్నిమాపక యంత్రాలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చాయి. యజ్ఞగుండంలోని నిప్పురవ్వలు ఎగిసి పడటం వల్లనే మండపానికి మంటలు అంటుకుని ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

మీరు నిజంగా ధనవంతులా ? లేక అలా నటిస్తున్నారా?

డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ
9490754169

మన తెలుగు లోగిళ్లలో ఈ మధ్య ఒక వింతైన, కాస్త ఆందోళనకరమైన ధోరణి కనిపిస్తోంది. పక్కింటి పిన్నమ్మగారి అబ్బాయి లక్షల జీతం తీసుకుంటున్నాడని మనవాడు అప్పు చేసి మరీ మెర్సిడెస్ కారు కొంటాడు. ఆఫీసులో కొలీగ్ ఖరీదైన ఐఫోన్ వాడాలని, క్రెడిట్ కార్డు ఈఎంఐలో కొత్త మోడల్ కొనేస్తాడు. పెళ్ళిళ్ళలో కోట్లు కుమ్మరించడం, బ్రాండెడ్ దుస్తుల కోసం పాకులాడటం ఇవన్నీ సమాజంలో మేము కూడా రిచ్ అని అనిపించుకోవడానికి చేసే తాపత్రయాలే. కానీ, ఇక్కడ అసలు సిసలు ప్రశ్న ఒకటి ఉంది: పైకి కనిపించే ఈ మెరుపులు, లోపల ఉన్న మీ బ్యాంకు ఖాతాను వెలిగించి పెడుతున్నాయా లేక ఖాళీ చేస్తున్నాయా? గత దశాబ్ద కాలంలో మన జీవితాల్లోకి సోషల్ మీడియా అనే ఒక మాయా ప్రపంచం ప్రవేశించింది. ఇన్స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వ్లాగ్స్ చూసి మన జీవితాలను ఇతరులతో పోల్చుకోవడం ఒక వ్యసనంగా మారింది. ఎవరో దుబాయ్ వెళ్లారని మనం అప్పు చేసి మరీ వెకేషన్ ప్లాన్ చేస్తాం. దీన్నే ఆర్థిక పరిభాషలో Lifestyle Inflation అంటారు. అంటే, సంపాదన పెరిగే కొద్దీ అవసరాల కంటే ఆడంబరాలు పెంచుకుంటూ పోవడం. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లో Keeping up with the Joneses అనే ఒక మాట ఉంది. అంటే, పక్కవాడి కంటే గొప్పగా ఉండాలని పడరాని పాట్లు పడటం. మన దగ్గర కూడా ఇప్పుడు అదే ట్రెండ్ నడుస్తోంది. పక్కవాడి కారు మనకంటే పొడవుగా ఉండాలి, వాడి ఫంక్షన్ కంటే మన ఫంక్షన్ గ్రాండ్గా ఉండాలి. ఈ పోటీలో మనం గెలుస్తున్నామేమో కానీ, మన ఆర్థిక భవిష్యత్తు మాత్రం ఓడిపోతోంది. ప్రపంచ ప్రసిద్ధ పరిశోధనలు ఏం చెబుతున్నాయో తెలుసా? నిజంగా కోట్లు గడించిన వ్యక్తులు తమ సంపదను ప్రదర్శించడానికి అస్సలు ఇష్టపడరు. ఉదాహరణకు, టెక్ దిగ్గజం బిల్ గేట్స్ ఎన్నో ఏళ్ల పాటు కేవలం $10 (సుమారు 800 రూపాయలు) విలువైన సాదాసీదా వాచ్చే ధరించారు. ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ ఇప్పటికీ 1958లో కొన్న పాత ఇంట్లోనే ప్రశాంతంగా నివసిస్తున్నారు. వీరికి తాము ధనవంతులమని లోకానికి చాటి చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, వారి బ్యాంక్ బ్యాలెన్స్ ఇచ్చే ఆత్మవిశ్వాసం ముందు ఏ బ్రాండెడ్ వస్తువూ సాటిరాదు.మన తెలుగులో ఒక సామెత ఉంది అప్పు చేసైనా పప్పు కూడు తినాలి అని. ఈ సామెతను మనవాళ్లు చాలా సౌకర్యంగా తప్పుగా అర్థం చేసుకున్నారు. అప్పు చేసి విలాసాలు అనుభవించమని దీని అర్థం కాదు.కష్టకాలంలో కూడా ఆత్మగౌరవంతో, పౌష్టిక ఆహారం తింటూ బతకాలని దీని పరమార్థం. కానీ నేడు అప్పు చేసి అద్దంలా మెరవాలి అన్నట్టు తయారైంది పరిస్థితి.రిచ్ గా కనిపించడం అనేది ఒక అద్దం లాంటిది. బయటికి నిగనిగలాడుతూ కనిపిస్తుంది కానీ, చిన్న దెబ్బ తగిలినా ముక్కలైపోతుంది. ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. సాఫ్ట్వేర్ రంగంలో నెలకు రూ. 80,000 సంపాదించే ఒక యువకుడిని తీసుకుందాం. అతని జీవనశైలి ఎలా ఉంటుందంటే, కారు EMI రూ. 20,000 ఖరీదైన ఫ్లాట్ అద్దె రూ. 15,000 క్రెడిట్ కార్డు పాత బకాయిలు రూ. 10,000 లేటెస్ట్ మొబైల్ EMI రూ. 8,000 అనవసరపు ఖర్చులు, పార్టీలు రూ. 10,000 అన్నీ పోను అతని చేతిలో మిగిలేది కేవలం రూ. 17,000 మాత్రమే. బయటి ప్రపంచానికి అతనొక హైప్రొఫైల్ ఉద్యోగి, కానీ అంతర్గతంగా అతను ఒక ఆర్థిక సంక్షోభం అంచున ఉన్నాడు. పొరపాటున ఉద్యోగం పోతే, ఆ మరుసటి నెల నుంచే అతని జీవితం తలకిందులవుతుంది. దీనికి భిన్నంగా నెలకు రూ. 50,000 సంపాదించే మరొక వ్యక్తిని చూడండి. అతను నిరాడంబరంగా ఉంటూ, నెలకు రూ. 15,000 పొదుపు చేసి మ్యూచువల్ ఫండ్స్లో పెట్టుబడి పెడతాడు. పదేళ్ల తర్వాత అతని దగ్గర ఉండే సంపద అతనికి ఒక భరోసాను, స్వేచ్ఛను ఇస్తుంది. అదే నిజమైన రివెన్జ్! ప్రసిద్ధ రచయిత మోర్గాన్ హౌసెల్ తన The Psychology of Money పుస్తకంలో ఒక అద్భుతమైన మాట చెప్పారు Wealth is what you don't see. (సంపద అంటే కంటికి కనిపించనిది). మనం రోడ్డుపై వెళ్లే ఖరీదైన కారును చూసి వారు ధనవంతులు అనుకుంటాం. కానీ సంపద అంటే ఆ కారు కొనకుండా బ్యాంకులో దాచుకున్న సొమ్ము, లేదా ఇన్వెస్ట్ చేసిన షేర్లు. అది బయటికి కనిపించదు, కానీ అది ఇచ్చే భద్రత వెలకట్టలేనిది. మనం మన పిల్లలకు ఏం నేర్పిస్తున్నాం? ఫలానా బ్రాండ్ బట్టలు వేసుకుంటేనే నీకు విలువ ఉంటుంది అని నేర్పిస్తున్నామా? లేక ఈరోజు నువ్వు దాచే రూపాయి రేపు నిన్ను కాపాడుతుంది అని నేర్పిస్తున్నామా? రాబర్ట్ కియోసాకి తన ప్రఖ్యాత గ్రంథం Rich Dad Poor Dad లో ఒక అద్భుతమైన సూత్రం చెప్పారు. ధనవంతులు ఆస్తులను కూడబెడతారు, పేదవారు బాధ్యతలను ఆస్తులు అనుకుని కొంటారు. మీ జేబులోకి డబ్బును తీసుకువచ్చేది ఆస్తి. ఉదాహరణకు: అద్దెకు ఇచ్చే ఇల్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారం. మీ జేబులో నుండి డబ్బును బయటికి తీసుకెళ్లేది బాధ్యత. ఉదాహరణకు మీరు వాడుకునే కారు (పెట్రోల్, మెయింటెనెన్స్ ఖర్చు), భారీ వడ్డీతో కట్టే వ్యక్తిగత రుణాలు. మన తెలుగు సమాజంలో పెళ్లిళ్ల ఖర్చు ఒక పెద్ద Liability. సగటు మధ్యతరగతి తండ్రి తన జీవితాంతం సంపాదించిన సొమ్మును, అప్పులను కలిపి ఒకే ఒక్క రోజు పెళ్లి వేడుకలో ఖర్చు చేస్తాడు. ఆ 2030 లక్షల రూపాయలను ఒకవేళ సరైన ఇన్వెస్ట్మెంట్ ప్లాన్లో పెడితే, మరో 20 ఏళ్లలో అది కొన్ని కోట్ల రూపాయలుగా మారుతుంది. లోకానికి రిచ్గా కనిపించడం కోసం మన భవిష్యత్తును పణంగా పెట్టడం అవసరమా? ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా FIRE (Financial Independence, Retire Early) అనే ఉద్యమం ఊపందుకుంటోంది. దీని ఉద్దేశ్యం ఏంటంటే 35 లేదా 40 ఏళ్లకే ఆర్థిక స్వేచ్ఛను సాధించి, నచ్చిన పని చేస్తూ జీవించడం. ఇది సాధ్యం కావాలంటే మనం రిచ్గా కనిపించడం అనే ముసుగును తీసి పక్కన పెట్టాలి. అనవసరపు ఖర్చులను తగ్గించి, ఆదాయంలో కనీసం 50% పొదుపు చేసే స్థాయికి చేరాలి. రిచ్గా కనిపించడం అనేది ఒక రంగుల కల, అది ఎప్పటికైనా కరిగిపోతుంది. కానీ నిజంగా రిచ్ అవడం అనేది ఒక తపస్సు, అది మీ జీవితానికి శాంతిని, గౌరవాన్ని ఇస్తుంది. గుర్తుంచుకోండి, మీరు వేసుకున్న బ్రాండెడ్ షర్టు మీ వ్యక్తిత్వాన్ని నిర్ణయించదు. కానీ మీ ఆర్థిక క్రమశిక్షణ మీ తలరాతను మారుస్తుంది. పక్కింటి వాళ్ళ కోసం బతకడం ఆపండి. మీ పిల్లల భవిష్యత్తు కోసం, మీ వృద్ధాప్య భరోసా కోసం పెట్టుబడి పెట్టడం ప్రారంభించండి.మీ ఖర్చుల జాబితా రాయండి అందులో ఎన్ని అవసరమో, ఎన్ని ఆడంబరమో వేరు చేయండి.కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడా ఎమర్జెన్సీ ఫండ్ సిద్ధం చేసుకోండి. రిచ్గా కనిపిస్తే చాలు అనే భ్రమ నుండి బయటపడి, నా దగ్గర తగినంత సంపద ఉంది అనే నిశ్చింత వైపు అడుగు వేయండి. నిజమైన తెలుగుదనం అంటే ఆడంబరం కాదు, ఆత్మవిశ్వాసం. కష్టపడి సంపాదించడం, తెలివిగా దాచుకోవడం, నిరాడంబరంగా జీవించడం ఇదే అసలైన ధనవంతుడి లక్షణం.

ప్రసిద్ధ రచయిత మోర్గాన్ హౌసెల్ తన The Psychology of Money పుస్తకంలో ఒక అద్భుతమైన మాట చెప్పారు Wealth is what you don't see. (సంపద అంటే కంటికి కనిపించనిది). మనం రోడ్డుపై వెళ్లే ఖరీదైన కారును చూసి వారు ధనవంతులు అనుకుంటాం. కానీ సంపద అంటే ఆ కారు కొనకుండా బ్యాంకులో దాచుకున్న సొమ్ము, లేదా ఇన్వెస్ట్ చేసిన షేర్లు. అది బయటికి కనిపించదు, కానీ అది ఇచ్చే భద్రత వెలకట్టలేనిది. మనం మన పిల్లలకు ఏం నేర్పిస్తున్నాం? ఫలానా బ్రాండ్ బట్టలు వేసుకుంటేనే నీకు విలువ ఉంటుంది అని నేర్పిస్తున్నామా? లేక ఈరోజు నువ్వు దాచే రూపాయి రేపు నిన్ను కాపాడుతుంది అని నేర్పిస్తున్నామా?



164 స్థానాల్లో డీఎంకే పోటీ

- కాంగ్రెస్ కు 28... డీఎండీకేకు 10 స్థానాలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చెన్నై, మార్చి 28: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం అధికార డీఎంకే తొలి జాబితా విడుదల చేసింది. మొత్తం 234 స్థానాలకుగాను 164 స్థానాల్లో డీఎంకే పోటీ చేయనున్నది. మిగతా 70 స్థానాలను మిత్రపక్షాలకు కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపిణీ గురించి సీఎం ఎంకే స్టాలిన్ శనివారం వెల్లడించారు. 164 స్థానాల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్‌కు 28 సీట్లు, డీఎండీకేకు 10, వీసీకేకు 8 స్థానాలు, సీపీఐ, సీపీఎం పార్టీలకు చెరో 5 సీట్లు, ఎండీఎంకేకు 4, మిగతా సీట్లను చిన్న పార్టీలకు కేటాయించినట్లు వివరించారు. కాగా, సీఎం ఎంకే స్టాలిన్ తన కొలత్తూరు నియోజకవర్గం నుంచే తిరిగి పోటీ చేయనున్నారు. ఆయన కుమారుడు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి చెపాక్‌ట్రిప్లికేన్ నుంచి బరిలోకి దిగుతున్నారు. ఇటీవల డీఎంకేలో చేరిన మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వంకు కూడా తొలి జాబితాలో చోటుదక్కింది. బోడినాయకనూరు స్థానం నుంచి ఆయన పోటీ చేయనున్నారు. కోయంబత్తూరు సౌత్ స్థానం నుంచి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ బరిలోకి దిగుతున్నారు.

భార్యతో అసహజ శృంగారం.. రేప్‌గా పరిగణించబడదు

- మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: భార్యతో అసహజ శృంగారం అత్యాచారం కింద పరిగణించకూడదని మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పు చెప్పింది. తన భర్త తనను లైంగికంగా వేధించాడంటూ ఒక మహిళ పెట్టిన కేసును హైకోర్టు గ్వాలియర్ బెంచ్ విచారించింది. 'వయోజనురాలైన భార్యపై భర్త చేసే లైంగిక చర్య లేదా శృంగార చేష్టలు అత్యాచారం కిందకు రావు. ఇందులో అంగీకారానికి సంబంధించిన విషయం అప్రధానమైనది' అని సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ మిలింద్ రమేశ్ ఫడ్కే తీర్పు చెప్పారు. ఈ కేసులో అత్యాచార నిర్వచనాన్ని విస్తరించి మలద్వార, ముఖ మైథునం వంటి చర్యలను కూడా అందులో చేర్చినట్టు బెంచ్ గమనించింది. భార్యాభర్తల శృంగారంలో అలాంటి చర్యలకు భారత శిక్షాస్మృతి 377 సెక్షన్‌ను వర్తింప చేయరాదని బెంచ్ పేర్కొంది. ఈ సందర్భంగా ఆ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను పాక్షికంగా కొట్టివేస్తూ తీర్పు చెప్పింది.

ఇండిగో విమానం అత్యవసర ల్యాండింగ్

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: విశాఖపట్నం నుంచి వస్తున్న ఇండిగో విమానం(6ఈ579) ఇంజన్ విఫలమైనట్లు అనుమానం రావడంతో ఢిల్లీ విమానాశ్రయ రన్‌వేపై పూర్తిస్థాయి అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. అత్యవసర ప్రొటోకాల్స్‌ని విమానాశ్రయ అధికారులు వెంటనే అమలు చేయడంతో రన్‌వే 28ని హై అలర్ట్‌లో ఉంచారు. కాగా, 161 మంది ప్రయాణికులతో వస్తున్న బోయింగ్ విమానం ఉదయం 11 గంటల సమయంలో రన్‌వేపై సురక్షితంగా దిగింది. ఈ ఘటనలో ఎటువంటి నష్టం జరగలేదని అధికార వర్గాలు తెలిపాయి. ల్యాండింగ్ కావడానికి కొన్ని క్షణాల ముందు సాంకేతిక లోపాన్ని గుర్తించినట్లు ఇండిగో ఓ ప్రకటనలో వెల్లడించింది.

సినిమా

మనసున్న మన మెగాస్టార్

గద్దర్ అవార్డ్స్ లో అందుకున్న పది లక్షల రూపాయలు స్వచ్ఛంద సంస్థలకు విరాళం

'మన శంకర వర ప్రసాద్ గారు' బ్లాక్‌బస్టర్ విజయాన్ని ఆస్వాదిస్తూ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులకు సిద్ధమవుతున్న మెగాస్టార్ చిరంజీవి, తన కుమారుడు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజును ప్రత్యేకంగా జరుపుకోవాలని నిర్ణయించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డుతో పాటు పది లక్షల నగదు బహుమతి అందుకున్న చిరంజీవి, ఆ మొత్తాన్ని తన చిరకాల సామాజిక సంక్షేమ లక్ష్యానికి అనుగుణంగా ఉన్న ఐదు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు. వారి దైనందిన అవసరాలకు మద్దతుగా చిరంజీవి 'సర్వ్ ఫౌండేషన్'కు విరాళం అందించారు. "గేమ్ ఛేంజర్" షూటింగ్ సమయంలో రామ్ చరణ్‌ను కలిసిన వృద్ధులు ఆయన పుట్టినరోజును జరుపుకోవాలని ఆశపడగా, చిరంజీవి ఆ కోరికను నెరవేర్చారు. 30 మంది వృద్ధులను బ్లడ్ బ్యాంక్‌కు ఆహ్వానించి, వారికి కొత్త బట్టలు ఇచ్చి, ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వేదిక ఈ కార్యక్రమం జరిగింది.

'సంక్రాంతికి...' మేం రెడీ

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, అనిల్ రావిపూడి కొలాబరేషన్ లో విజయవంతమైన నిర్మాణ సంస్థ 'షైన్ స్క్రీన్స్' ఇటీవల ఒక భారీ సినిమాటిక్ కొలాబరేషన్‌ను ప్రకటించింది. భారీ పండుగ వినోదాత్మక చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమా (#VenkyAnil5 & #NkrAR2), 2027 సంక్రాంతికి ఘనంగా విడుదల కావడానికి సిద్ధమవుతోంది. 'షైన్ స్క్రీన్స్' బ్యానర్‌పై సాహు గారపాటి ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించనున్నారు. ఈ బ్యానర్ ఇప్పటికే 'భగవంత్ కేసరి' రీజినల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాలను అందించింది. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, జీ స్టూడియో సహనిర్మాతగా చేరింది. F2, F3, సంక్రాంతికి వస్తున్నం వంటి బ్లాక్‌బస్టర్ ఎంటర్‌టైనర్‌ల తర్వాత ఇది అనిల్ రావిపూడి వెంకటేష్‌తో కలిసి చేస్తున్న ఐదవ చిత్రం కావడం విశేషం. ఇటివలే MSGలో అతిథి పాత్రలో అదరగొట్టారు వెంకటేష్. అలాగే సంచలనాత్మక బ్లాక్‌బస్టర్ పటాస్ తర్వాత కళ్యాణ్ రామ్‌తో ఇది అనిల్ రావిపూడి రెండవ చిత్రం. ఈ కొత్త చిత్రం, దర్శకుడు అనిల్ రావిపూడితో షైన్ స్క్రీన్స్ సంస్థకు మూడో కొలాబరేషన్ నిలుస్తూ, వీరి విజయవంతమైన అనుబంధం మరింత బలపడింది. విజయవంతమైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లకు కేరాఫ్ అడ్రెస్ అయిన దర్శకుడు అనిల్ రావిపూడి మరోసారి క్లీన్ గా, అన్ని వయస్సుల ప్రేక్షకులను ఆకట్టుకునే కథతో కొత్త ప్రాజెక్ట్‌ను సిద్ధం చేస్తున్నారు. హాస్యం, భావోద్వేగాలు, పండగ వాతావరణం అన్నీ కలిసి ఈ సినిమాను ఒక పర్ఫెక్ట్ సంక్రాంతి ట్రీట్ గా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్‌ను అనిల్ రవిపూడి అంచనాలకు తగ్గట్టుగా రూపొందిస్తున్నారు. త్వరలో గ్రాండ్ పూజా కార్యక్రమంతో సినిమాను ప్రారంభించి, ఆ తర్వాత టైటిల్ తో పాటు ఇతర వివరాలను వెల్లడించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం సంక్రాంతి 2027కు రానున్న బిగ్గెస్ట్ ఎంటర్‌టైనర్లలో ఒకటిగా నిలుస్తోంది. బ్లాక్‌బస్టర్ డైరెక్టర్, స్టార్ క్యాస్ట్, స్ట్రాంగ్ ప్రొడక్షన్ బ్యాకింగ్ అన్నీ కలిసి ఈ సినిమాను మరొక మరిచిపోలేని సంక్రాంతి ఎక్స్ పీరియన్స్ గా నిలవనుంది.

'బరి'లో వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ మీద నిహారిక కొణిదెల నిర్మాతగా యదు వంశీ తెరకెక్కిస్తున్న నూతన చిత్రం 'బరి'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమాలను శనివారం నాడు నిర్వహించారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ఆంధ్ర ప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టగా మైత్రీ మూవీస్ నిర్మాత నవీన్ యెర్నేని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు మేర్లపాక గాంధీ, నిర్మాత రాజీవ్ రెడ్డి ఎదుగురు స్క్రిప్ట్ అందజేశారు.

ఐపీఎల్ ఆరంభం... ఆర్సీబీ బోణీ

సన్ రైజర్స్ పై బెంగళూరు ఘన విజయం

చిన్నస్వామి స్టేడియంలో ఉద్విగ్నభరిత క్షణాల మధ్య శనివారం జరిగిన లీగ్ తొలి పోరులో ఆర్‌సీబీ దుమ్మురేపింది. వేలాది మంది ప్రేక్షకుల మధ్య సమష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ ఆర్‌సీబీ 6 వికెట్ల తేడాతో(26 బంతులు మిగిలుండగానే) సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ నిరుడు సీజన్‌లో ఐపీఎల్ టైటిల్‌ను తొలిసారి ముద్దాడిన ఆర్‌సీబీ చాంపియన్ ఆటతీరు కనబరిచింది. టాస్ గెలిచిన ఆర్‌సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్..హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్(38 బంతుల్లో 80, 8ఫోర్లు, 5 సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీతో హైదరాబాద్ 20 ఓవర్లలో 201/9 స్కోరు చేసింది. క్లాసెన్(31), అనికేత్(43) రాణించడంతో హైదరాబాద్ పోరాడే స్కోరు దక్కింది. అరంగేట్రం బౌలర్ జాకబ్ డఫీ(3/22), రొమారియో షెఫర్డ్(3/54) మూడేసి వికెట్లతో రాణించారు. లక్ష్యఛేదనలో విరాట్ కోహ్లీ(38 బంతుల్లో 69 నాటౌట్, 5ఫోర్లు, 5 సిక్స్‌లు), దేవదత్ పడిక్కల్(26 బంతుల్లో 61, 7ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో బెంగళూరు 15.4 ఓవర్లలో 203/4 స్కోరు చేసింది. డేవిడ్ పైన్(2/35)రెండు వికెట్లు తీశాడు. డఫీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

కోహ్లీ, పడిక్కల్ పరుగుల వరద

టార్గెట్ ఛేదించడంలో ఆర్‌సీబీ బ్యాటర్లు ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఫామ్‌లేమితో సతమతమవుతున్న ఫిల్ సాల్ట్..నితీశ్‌కుమార్‌రెడ్డి బౌలింగ్‌లో బౌండరీలతో విరుచుకుపడ్డా అదే జోరు కొనసాగించలేకపోయాడు. ఉనద్కట్ రెండో ఓవర్‌లో భారీ షాట్ ఆడబోయిన సాల్ట్ మిడాఫ్‌లో క్లాసెన్ చేతికి చిక్కాడు. ఒకే క్యాచ్ కోసం ఇద్దరు ప్రయత్నించినా ఆఖరికి క్లాసెన్‌కే దక్కడంతో హైదరాబాద్ ఊపిరి పీల్చుకుంది. డఫీ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన దేవదత్ పడిక్కల్ క్రీజులోకి వచ్చి రావడంతోనే సిక్స్‌తో తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. దేశవాళీ సీజన్‌లో సూపర్ ఫామ్‌ను ఐపీఎల్‌లో కొనసాగిస్తూ పడిక్కల్ అలవోకగా బౌండరీలు బాదడంతో స్కోరుబోర్డు ఊపందుకుంది. మరో ఎండ్‌లో కోహ్లీ కూడా బ్యాటు ఝులిపించడంతో పరుగుల రాక సులువైంది. డేవిడ్ పైన్ నాలుగో ఓవర్‌లో పడిక్కల్ విశ్వరూపం చూపించాడు. రెండు భారీ సిక్స్‌లు, ఓ ఫోర్‌తో పడిక్కల్ 18 పరుగులు పిండుకున్నాడు. మరుసటి ఓవర్‌లో తన వంతూ అంటూ కోహ్లీ కూడా రెచ్చిపోవడంతో 50 పరుగుల భాగస్వామ్యం ఏర్పడింది. పవర్‌ప్లే ముగిసేసరికి ఆర్‌సీబీ వికెట్ కోల్పోయి 76 పరుగులు చేసింది.

28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే ప్రమాదం నుంచి కోహ్లీ బయటపడగా, 8.1 ఓవర్లలో ఆర్‌సీబీ 100 పరుగుల మార్క్ అందుకుంది. ఇన్నింగ్స్ ఊపందుకుంటున్న తరుణంలో అప్పటికే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పడిక్కల్..దూబే బౌలింగ్‌లో ఔట్ కావడంతో రెండో వికెట్‌కు 101 పరగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ బాధ్యతను తీసుకున్న కోహ్లీ..కెప్టెన్ పాటిదార్(31)తో కలిసి ముందుకు నడిపించాడు. అయితే పైన్ బౌలింగ్‌లో పటిదార్, జితేశ్(0) వెంటవెంటనే ఔటైనా..ఆఖర్లో డేవిడ్(16 నాటౌట్)తో కలిసి కోహ్లీ గెలుపు తీరాలకు చేర్చాడు.

అందరూ విఫలమైన వేళ.. ఇషాన్ ఒక్కడే!

ఇషాన్ కిషన్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. సహచరులు విఫలమైన వేళ తన ఫామ్‌ను కొనసాగిస్తూ జట్టుకు భారీ స్కోరు అందించాడు. హెడ్(11), అభిషేక్(7) స్వల్ప స్కోర్లకే వెనుదిరుగగా, కిషన్ సాధికారిక ఇన్నింగ్స్ ఆడాడు. మిడిలార్డర్‌లో నితీశ్(1), సలీల్ అరోరా(9), హర్ష్‌దూబే(3) ఇలా వచ్చి అలా వెళ్లారు. క్లాసెన్‌తో కలిసి కిషన్ ఇన్నింగ్స్..హైదరాబాద్ 200ల స్కోరుకు కారణమైంది. దీనికి తోడు ఆఖర్లో అనికేత్ దూకుడుగా ఆడటం కలిసొచ్చింది.

11 మంది స్మృతిలో.. ఖాళీగా 11 సీట్లు

గతేడాది ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా చిన్నస్వామి స్టేడియం పరిసరాల్లో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన 11 మందికి ఆర్‌సీబీ, హైదరాబాద్ ప్లేయర్లు ఘనంగా నివాళి అర్పించారు. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో ఘటనకు సంతాప సూచికంగా అందరూ 11 నంబర్ జెర్సీలు ధరించారు. దీనికి తోడు స్టేడియంలో 11 సీట్లను ఖాళీగా వదిలిపెడుతూ మృతులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరు జట్ల ప్లేయర్లు బౌండరీ లైన్ వద్ద మృతుల కుటుంబాలకు సంతాప సూచకంగా కొద్దిసేపు మౌనం పాటించారు. ఆ తర్వాత జాతీయ గీతాలాపన చేసి బరిలోకి దిగారు.

పడిక్కల్.. ఇంపాక్ట్ ప్లే...

ఆర్సీబీ యువకెరటం దేవ్‌దత్ పడిక్కల్ (61)ఐపీఎల్ ఆరంభ పోరులో కుమ్మేశాడు. జాకబ్ డఫ్ఫీ స్థానంలో ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన పడిక్కల్ సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లను ఊచకోత కోశాడు. ఫిలిప్ సాల్ట్(8)ను ఔట్ చేసి సంబురాల్లో మునిగిన హైదరాబాద్ జట్టును హడలెత్తిస్తూ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడ్డాడు. పడిక్కల్ మెరుపులతో ఆర్సీబీ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 76 పరుగులు చేసింది. ఆ తర్వాత కూడా బౌలర్ ఎవరైనా సరే బంతి గమ్యం బౌండరీయే అన్నట్టుగా విధ్వంసం కొనసాగించాడీ లెఫ్ట్ హ్యాండర్. హర్షల్ పటేల్ ఓవర్లో ఫోర్‌తో 21 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్న పడిక్కల్‌ను ఎట్టకేలకు హర్ష్ దూబే ఔట్ చేశాడు. కానీ, అప్పటికే చేయాల్సినంత నష్టమంతా చేసేన ఈ స్టార్ బ్యాటర్ ఆర్సీబీ విజయానికి బాటలు వేశాడు. అప్పటికీ ఆర్సీబీ స్కోర్.. 1102

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200